చింతలగార భూములకు సంబంధించిన అక్రమ రిజిస్ట్రేషన్లు రద్దు చేయాలి

- సబ్ రిజిస్ట్రారు కార్యాలయం ముందు సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా
- రిజిస్ట్రేషన్లు రద్దు చేయకుంటే ఆగష్టు14 నుండి 48 గంటలు నిరసన

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : టెక్కలి మండలం చింతలగార రెవెన్యూ గ్రామంలో సర్వే నెంబరు 8/2 లో 6.04 ఎకరాల భూమిపై కోటబొమ్మాళి సబ్ రిజిస్ట్రారు కార్యాలయంలో జరిగిన అక్రమ రిజిస్ట్రేషన్ దస్తావేజు నెంబర్లు 2652/2020 మరియు 1076/2021లను టెక్కలి సబ్ కలక్టర్ ఉత్తర్వులు ప్రకారం తక్షణమే రద్దు చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) టెక్కలి డివిజన్ సమితి నాయకులు డిమాండ్ చేశారు. గురువారం కోటబొమ్మాళి సబ్ రిజిస్ట్రారు కార్యాలయం ముందు సీపీఐ ఆధ్వర్యంలో బాధిత రైతులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి బలగ శ్రీరామ్మూర్తి, జిల్లా సమితి సభ్యులు అనపాన షణ్ముఖరావు మాట్లాడుతూ టెక్కలి మండలం చింతలగార రెవెన్యూ గ్రామంలో సర్వే నెంబరు 8/2లో 1978లో రిజిస్ట్రేషన్ దస్తావేజుల ద్వారా 9.04 ఎకరాలు భూమిని కొనుగోలు చేసి గత 44 ఏళ్ళుగా కొంతమంది రైతులు అనుభవిస్తున్నారని అన్నారు. గతంలో భూములు అమ్మిన ముగ్గురు వ్యక్తుల్లో ఒకరి భార్య పేరున అక్రమ మ్యుటేషన్ చేసి, తద్వారా తమ్మినాన రామారావు, గురుబెల్లి బాలకృష్ణలు కోటబొమ్మాళి సబ్ రిజిస్ట్రారు కార్యాలయంలో రిజిస్ట్రేషన్ దస్తావేజు నెంబర్లు 2652/2020 తేది.21.12.2020 ద్వారా విస్తీర్ణం 3.94 ఎకరాలు మరియు 1067/2021 తేది 17.04.2022 ద్వారా విస్తీర్ణం 2.10 ఎకరాలను అక్రమ పద్ధతిలో రిజిస్ట్రేషన్ చేసుకొని, అనంతరం టెక్కలి మండల తహశీల్దార్ కార్యాలయంలో మ్యుటేషన్ చేయించుకొని రైతుల భూముల పై ఈ పాస్ పుస్తకం, ఖాతా నెంబరు 242 పేరిట తమ్మినాన రామారావు, గురువెల్లి బాలకృష్ణ పొందియున్నారని వివరించారు. కోటబొమ్మాళి సబ్ రిజిస్ట్రారు సబ్ కలక్టర్ ఆదేశాలు అమలు చేయకపోవడమేగాక, విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. కనీసం తమ ఉన్నతాధికారుల దృష్టికి కూడా సమస్యను తీసుకువెళ్లడంలో విఫలమయ్యారని ఆరోపించారు. పదిహేను రోజుల్లో సబ్ కలక్టర్ ఉత్తర్వులు అమలుచేసి, బాధిత రైతులకు న్యాయం చేయని ఎడల సబ్ రిజిస్ట్రారు కార్యాలయం ముందు వచ్చేనెల 14వ తేదీన 36 గంటలు నిరసన కార్యక్రమం చేపడతామని మెమొరాండం సబ్ రిజిస్ట్రారుకు అందించారు. అంతకు ముందు సీపీఐ పార్టీ నాయకులు, రైతులు ధర్నా కార్యక్రమంలో టెక్కలి సబ్ కలక్టర్ ఉత్తర్వులు అమలు చేయాలని, అక్రమ రిజిస్ట్రేషన్లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు మరియు డి.హెచ్.పి.ఎస్.జిల్లా ప్రధాన కార్యదర్శి యడ్ల గోపి, పొన్నాడ జగ్గారావు, నంభాళ్ళ గోవిందరాజులు, బాధిత రైతులు తిర్లంగి సత్యం, ఎస్.భాస్కరరావు, ఎస్.రామ్మూర్తి, తిర్లంగి జోగినాయుడు, గూన లక్ష్మణరావు, ఎస్.సురేష్, హెచ్.ఆనందరావు, బి.మల్లేశ్వరరావు, బి.నర్సింహమూర్తి, టి.త్రినాథ్, యు.శశిభూషణ రావు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ప్రశస్తి ఎంతో అవసరం

విశాలాంధ్ర-సంతబొమ్మాళి ప్రత్యేక అవసరాలున్న పిల్లలను గుర్తించి, వారి సమగ్ర వివరాలను నమోదు చేయటానికి సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో, ప్రశస్తి యాప్లో ఉపాధ్యాయులందరూ నమోదు చేయడం జరుగుతుందని సంతబొమ్మాళి స్కూల్ అసిస్టెంట్, ప్రత్యేక ఉపాధ్యాయుడు సనపల రాంబాబు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సంతబొమ్మాళి మండలంలో పాఠశాలల్లో సుమారు 120 మంది ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించడం జరిగిందని, 180 మంది ఉపాధ్యాయులు ఈ యాప్ డౌన్లోడ్ చేసుకోవడం జరిగిందని అన్నారు, ఈ ప్రత్యేక అవసరాలు గల పిల్లల సర్వే ఈనెల 28వ తేదీ వరకు జరుగుతుందని అన్నారు. కావున ప్రతీ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలోని ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, ప్రత్యేక ఉపాధ్యాయులందరూ ప్లే స్టోర్ నుంచి ప్రశస్తి యాప్ డౌన్లోడ్ చేసుకుని, రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. ఈ యాప్ లో 21రకాల వైకల్యాలు గల ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించేందుకు వీలుగా 64 ప్రశ్నలను పొందుపరిచారని అన్నారు. ప్రశస్తి యాప్లో నమోదైన ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు తగిన వైద్య సేవలు, సహాయక చర్యలు, సేవలు, సదుపాయాలు, సంక్షేమ కార్యక్రమాలను అందించేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని అన్నారు. సంతబొమ్మాళి హైస్కూల్, కేజీబీవీ పాఠశాలల్లో సర్వే జరిగిందని తెలిపారు.

పనిదినాల కల్పనలో ఏపీ అగ్రస్థానం

ఈ.జి.ఎస్. డైరెక్టర్ చిన్న తాతయ్యలు

విశాలాంధ్ర-శ్రీకాకుళం: గ్రామీణ ప్రాంతాల సమగ్రాభివృద్ధికి మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ఎంతగానో తోడ్పడతుందని రాష్ట్ర ఉపాధి హామీ పథకం డైరెక్టర్ పి.చినతాతయ్యలు అన్నారు. గురువారం శ్రీకాకుళం జడ్పీ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనితీరుపై సమీక్షించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఈఏడాది 24కోట్ల పనిదినాల కల్పించాలని నిర్ణయించగా ఇంతవరకు 18కోట్ల పనిదినాల కల్పించామన్నారు. దేశంలో ఇది ఒక అరుదైన రికార్డు అన్నారు. వేతనదారులకు డైరెక్ట్ బెనిఫిట్ పథకం కింద నేరుగా వారి వారి బ్యాంక్ ఖాతాల్లో వేతనాలు జమచేస్తున్నామని అన్నారు. డీబీటీ పథకం ద్వారా ఉపాధి కూలీలకు వేతనాలు ఇవ్వటం వల్ల ఎటువంటి ఆరోపణలకు ఆస్కారం లేకుండా పోయిందన్నారు. ఈ ఏడాది 45లక్షల కుటుంబాలకు 6వేల కోట్ల రూపాయలు వేతనాల కింద అందించామన్నారు. ఈ ఏడాది ఉద్యాన వనాల పెంపకానికి అగ్రతాంబూల మిస్తున్నామని, 60వేల ఎకరాల్లో ఉద్యాన వనాలు పెంపకానికి కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. రాష్ట్రంలో మౌలిక వసతులు కల్పనకు ఈ ఆర్థిక సంవత్సరంలో 3500 నుండి 4వేల కోట్ల రూపాయలు వ్యయం చేస్తున్నామన్నారు. మానవ వనరులను సాంకేతికతతో జోడించి వినూత్న తరహా కార్యక్రమాలు అమలు చేస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. మునగ పంట రైతులకు అత్యధిక శాతం ఆదాయం వస్తుందని, దీన్ని దృష్టిలో పెట్టుకొని మునగ పంట పై విస్తృత స్థాయిలో ప్రచారం చేస్తున్నామని అన్నారు. చిన్న సన్నకారు రైతులు మునగపంట పెద్దఎత్తున వేసికొని అధిక ఆదాయాన్ని సమకూర్చు కోవాలని డైరెక్టర్ విజ్ఞప్తి చేశారు. అంతకంటే ముందు శ్రీకాకుళం జిల్లాలో అమలౌతున్న ఉపాధిహామీ పథకం పనులపై మండలాల వారీ సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. కింది స్థాయి సిబ్బంది తప్పు చేస్తే ఆ పై అధికారులదే బాధ్యత అని, క్షేత్ర స్థాయి లో పనులను పరిశీలించడం ఏపీఓ ల పని, అదనపు బాధ్యతలు సాకుతో పనులు పట్ల నిర్లక్ష్యం చేయకూడదని ఆయన అన్నారు. ఈ సమావేశంలో శ్రీకాకుళం జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు చిట్టిరాజు తదితరులు పాల్గొన్నారు.

దేవానంద్‌కి వందే భారత్ ప్రశంసాపత్రం

విశాలాంధ్ర-శ్రీకాకుళం రూరల్: సాహితీ చైతన్య కిరణాలు, బాలకథా నిలయం రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఉపాధ్యాయులు పాలక దేవానంద్ కి సాహితీ చైతన్య కిరణాలు, భాలకథానిలయం జాతీయ అధ్యక్షులు డా.భోగెల ఉమామహేశ్వర రావు (ఉమాకవి)కి హిందూ భారతి జాతీయ సాహిత్య వేదిక అధ్యక్షులు పొట్లూరి హరికృష్ణ నిర్వహించిన వందే భారత్ అంతర్జాల కవితోత్సవంలో జైభారత్ అనే కవిత చదివినందుకు వందే భారత్ ప్రశంసాపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సాహితీ సభ్యులు కిరణ్, బాలకృష్ణ, రెడ్డి పద్మావతి తదితరులు వీరిద్దరికి అభినందనలు తెలిపారు.

జగనన్న సురక్షతో అందరకీ న్యాయం

రాష్ట్ర కళింగ కార్పొరేషన్ చైర్మన్ తిలక్

విశాలాంధ్ర-సంతబొమ్మాళి. జగనన్న సురక్ష కార్యక్రమంతో అందరికీ సమాన న్యాయం జరుగుతుందని రాష్ట్ర కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేడాడ తిలక్ అన్నారు. సురక్ష సర్పంచ్ శ్రీ రెయ్యి రామిరెడ్డి అధ్యక్షతన గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారన్నారు. అనంతరం జెడ్పిటిసి పాల వసంతరెడ్డి కి సన్మానించారు. కార్యక్రమంలో మండల ఎంపీపీ మేరుగు రాజేశ్వరి అప్పారావు, జెడ్పిటిసి పాల వసంత రెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షులు తెల్లి జగన్నాయకులు (గోవింద్), నందిగాం మండల ఎంపిపి శ్రీరామ మూర్తి, వైస్ ఎంపిపి ప్రతినిధి పొందల రామకృష్ణ, ఎంపిడిఓ సి.హెచ్ ప్రేమకుమారి, డిప్యూటీ తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, మండల వైకాపా యువ నాయకులు రెయ్యి ప్రసాద్‌రెడ్డి, వడ్డివాడ సర్పంచ్ గూట్ల మల్లేశ్వరరావు, భావనపాడు సర్పంచ్ బుడ్డా మోహన రెడ్డి, పాలతలగం సర్పంచ్ ప్రతినిధి నాక్కిట్ల నరేష్, మాజీ సర్పంచ్ మండపాక నర్సింగరావు, మండల కన్వీనర్‌ల సంఘం అధ్యక్షుడు మోదీ భాస్కరరావు, పల్లి లక్ష్మణరావు, పీస పాపారావు, పంచాయతీ కార్యదర్శి ఎస్ ధిల్లేశ్వరరావు, సచివాలయం సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్ వీరన్న, వాలంటీర్లు, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

దశాబ్దాలుగా జీడి రైతులను దగా చేస్తున్న పాలకులు

విశాలాంధ్ర-పలాస : ఉద్దానం జీడి రైతులను పాలకులు దశాబ్దాలుగా దగా చేస్తున్నారని, జీడి పంటకు మద్దతు ధర కోసం రైతులు పోరాడినా పాలకులు యాజమాన్యాల వైపే కొమ్ము కాస్తున్నారని వామపక్ష నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గురువారం కాశీబుగ్గలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిపిఐ నాయకులు వేణుగోపాల్, సిపిఎం నాయకులు గణపతి, సిపిఎం లిబరేషన్ నాయకులు మద్దిల రామారావు, పిడిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షులు వినోద్‌లు మాట్లాడుతూ 80కేజీల బస్తా రూ.16వేలకు రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని కోరుతుంటే 9వేల రూపాయలకే వ్యాపారులు కొనుగోలు చేయాలని అధికారులు, ప్రజా ప్రతినిధులు కోరడం సరైనది కాదని, ఇది ఏకపక్ష నిర్ణయం అని వారు పేర్కొన్నారు. జీడి రైతులను ఆదుకోవాలని రైతులంతా కోరుతుంటే బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్, మంత్రి సీదిరి అప్పలరాజు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పరిశ్రమల యజమానులతో బేర సారాలు అడడం జీడి రైతులను దగా చేయడమేనని వామపక్షాల నాయకులు అన్నారు. గతంలో కూడా మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు, జిల్లా కలెక్టర్ సమక్షంలో బస్తాకు వెయ్యి రూపాయలు అదనంగా ఇస్తామని హామీ ఇచ్చారని, అది నేటికీ నెరవేరలేదని గుర్తు చేశారు. రైతులను మభ్యపెట్టేందుకు ఇటువంటి ప్రయత్నాలు చేయడమని విమర్శించారు. ప్రభుత్వమే కొనుగోలు చేసి ప్రాసెసింగ్ చేయడానికి పరిశ్రమ స్థాయిని బట్టి వారికి కేటాయించాలని ఆదేశించాల్సింది పోయి వ్యాపారులతో బేరసారాలు చేయడం ప్రభుత్వానికి తగదన్నారు. ప్రభుత్వం రైతులకు న్యాయం చేస్తామని అనుకుంటే రైతులతో సమావేశం ఏర్పాటుచేసి వారికి అనుకూలమైన రేటు కోసం ప్రభుత్వం కృషి చేయాలన్నారు. వ్యాపారులతో సమావేశం వేయడం ద్వారా ప్రభుత్వం వ్యాపారుల పక్షమేనని తేలిందని అన్నారు. ప్రభుత్వ అధికారుల వైఖరిపై తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. జీడి రైతుల పోరాటం 16వేల రూపాయలు మద్దతు కోసం అని అది సాధించే వరకు జీడి రైతాంగ పోరాటం కొనసాగుతుందని తెలిపారు. జీడి రైతుల పోరాటానికి వామపక్ష నాయకులు సంపూర్ణ మద్దతు ఇస్తామన్నారు.

వైస్ ఎంపీపీ లోతుగెడ్డకు యునిక్ లీడర్ ఆఫ్ ది ఇయర్ అవార్డ్

విశాలాంధ్ర-కొత్తూరు : వైస్ ఎంపీపీ అడ్వకెట్ లోతుగెడ్డ తులసీ వరప్రసాద్‌రావు యునిక్ లీడర్ ఆఫ్ ది ఇయర్ అవార్డ్‌కు ఎంపికయ్యారు. సామాజిక, రాజకీయ, సేవారంగాల్లో విశేషమైన కృషి చేసినవారికి శ్రీకాకుళంకు చెందిన ది ఫోరం ఫర్ బెటర్ సంస్థ ఏటా ఈ అవార్డ్‌ను అందజేస్తుంది. ఈ పై మూడు అంశాల్లో లోతుగెడ్డ గత కొంతకాలంగా ఎంతో కృషి చేస్తున్నారు. వీటన్నింటినీ పరిశీలించిన ది ఫోరం బెటర్ సంస్థ ఈ ఏడాదికి కొత్తూరు వైస్ ఎంపీపీ లోతుగెడ్డ తులసి వర్షప్రసాద్‌రావును ఎంపికచేసి గురువారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఈ అవార్డును సంస్థ అధ్యక్ష కార్యదర్శులు దుర్గాప్రసాద్, డాక్టర్ దేవభూషన్‌రావు ఇతర సభ్యులు చేతులమీదుగా లోతుగెడ్డకు అందజేసారు.

మున్సిపల్ కార్మికుల నిరసన

విశాలాంధ్ర-కాశీబుగ్గ : గత కొంతకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ పిలుపు మేరకు కాశీబుగ్గ లో గాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులకు పర్మినెంట్ చేయాలని, హెల్త్ అలవెన్సు జీతాలతోపాటు చెల్లించాలని రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించి పింఛను అమలు చేయాలని, సుప్రీం కోర్టు తీర్పు అమలు చేయాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, పి.ఎఫ్ డబ్బులు 33 లక్షల 50వేల రూపాయలు కార్మికుల ఖాతాల్లో జమ చేయాలని కోరారు. అలాగే ఉద్యోగ విరమణ చేసిన కార్మికుల స్థానంలో వారి కుటుంబాలకు అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో కార్మికుల యూనియన్ అధ్యక్షులు సి.హెచ్.మురగన్, వి.సీతమ్మ, ఎస్.ఉషా, శకుంతల,ల జగ్గముఖి, ఎస్.త్రివేణి, పద్మ, పార్వతి, నానిలు పాల్గొన్నారు.

ఖచ్చితమైన ఓటర్ల జాబితా తయారీకి పార్టీలు సహకరించాలి : కలెక్టర్

విశాలాంధ్ర-శ్రీకాకుళం: ఖచ్చితమైన వివరాలతో స్వచ్ఛమైన ఓటర్ల జాబితాను రూపొందించేందుకు రాజకీయ పార్టీలు తమవంతు సహకారాన్ని అందించాలని జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ కోరారు. ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా, కలెక్టరేట్ సమావేశ మందిరంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో గురువారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా ఈనెల 21 నుంచి ఇంటింటి సర్వే ప్రారంభమవుతుందని చెప్పారు. నెలరోజులపాటు జరిగే కార్యక్రమంలో భాగంగా బూత్ స్థాయి అధికారులు ప్రతీ ఇంటికీ వెళ్లి, ఓటర్ల వివరాలను తనిఖీ చేస్తారని చెప్పారు. కొత్త ఓటర్ల నమోదు, లేని ఓటర్ల పేర్లు తొలగించడంతోపాటు, అడ్రస్, డోర్ నెంబరు తదితర వివరాలను కూడా ఓటర్ల జాబితాల్లో సరిచేస్తారని చెప్పారు. ఈ ప్రక్రియ ఖచ్చితంగా, సంపూర్ణంగా తయారు చేసేందుకు పార్టీల సహకారం కూడా అవసరమని పేర్కొన్నారు. దీనికోసం రాజకీయ పార్టీలు తమ బూత్ ఏజెంట్ల జాబితాలను ముందే తమకు అందజేయాలని కోరారు. బిఎల్ఓతోపాటు, పార్టీల ఏజెంట్లు కూడా ఇంటింటికి వెళ్లి వివరాలను సేకరించడం ద్వారా సమగ్ర జాబితాలు తయారవుతాయని అన్నారు. అర్హత ఉన్న ప్రతీ ఒక్కరికీ ఓటుహక్కు కల్పించేందుకు కృషి చేస్తామని అన్నారు. దీనిలో భాగంగా కళాశాలల్లో కొత్త ఓటర్ల నమోదుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తామని తెలిపారు. వలస కార్మికులు, ట్రాన్స్ జెండర్లు, ఇళ్లులేని, స్థిర నివాసం లేని వారి వివరాలను కూడా సేకరించి ఓటుహక్కు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. డూప్లికేట్ ఓట్లను తొలగించేందుకు ప్రత్యేక చర్యలు చేపడతామని, వారు ఎక్కడ నివాసం ఉంటే అక్కడే ఓటుహక్కు కల్పించి, రెండోదాన్ని తొలగిస్తామని కలెక్టర్ చెప్పారు. ఈ సమావేశంలో వైకాపా ప్రతినిధి ఆర్. శ్రీనివాసరావు, బిజెపి ప్రతినిధి బి. ఉమామహేశ్వరరావు, బిఎస్‌పి ప్రతినిధి బొకరా నారాయణరావు, టిడిపి ప్రతినిధి పి.ఎం జె.బాబు, కాంగ్రెస్ ప్రతినిధి మల్లిబాబు, ఇంచార్జ్ డిఆర్ఓ మురళీ కృష్ణ, ఇఆర్ఓలు, ఎలక్షన్ సెల్ అధికారులు, ఎన్నికల డిటిలు పాల్గొన్నారు.

శరవేగంగా అభివృద్ధి పనులు

వైస్ ఎంపీపీ రాజు

విశాలాంధ్ర-వజ్రపుకొత్తూరు : మండలంలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని వైస్ ఎంపీపీ వంక రాజు అన్నారు. గురువారం మండలం మంచినీళ్లపేటలో రూ. 10 లక్షలతో నిర్మిస్తున్న డ్రైనేజీ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచినీళ్లపేటలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం లో మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు డ్రైనేజీ పనులకు నిధులు సమకూర్చారన్నారు. ఈడ్రైనేజీ నిర్మాణం పూర్తి అయితే గ్రామంలో నీరు నిలిచిపోయే సమస్య తీరుతుంది అన్నారు. మంత్రి అప్పలరాజు సహకారంతో అన్ని రంగాల్లో అభివృద్ధి జరుగుతుంది అన్నారు. తీర ప్రాంత గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక లతో ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు. ఆయనతో పాటు సర్పంచ్ వంక సత్యరాజ్ ఉన్నారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

విశాలాంధ్ర-పలాస : పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ సూదికొండ కాలనీకి చెందిన వివాహిత మహిళ పైల సావిత్రి(35) గురువారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. కాశీబుగ్గ పోలీసులు, స్థానికులు కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కాశీబుగ్గకు చెందిన జానకిరావుకు వజ్రపుకొత్తూరు మండలం అనంతగిరి గ్రామానికి చెందిన సావిత్రికు 13 ఏళ్ళు క్రితం వివాహమైంది. గత రెండు రోజులుగా భార్య భర్తలు గొడవ పడుతున్నారు. భార్య సావిత్రి ఇంటిలో స్పృహ కోల్పోయి పడి ఉండడం చూసి స్థానికులు, భర్త జానకిరావు పలాస ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ మృతి చెందింది. వాస్తవానికి ఇంటిలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిందా...? భర్త ఆమెపై దాడి చేయడం వల్ల మృతి చెందిందా...? అనే విషయం తెలియాల్సి ఉంది. మృతురాలి ఒంటి పై చిన్న చిన్న గాయాలు ఉన్నాయని మృతురాలి బంధువులు చెబుతున్నారు. ఈమె మృతిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మృతురాలికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించి కాశీబుగ్గ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఈ వ్యవహారం పై కాశీబుగ్గ సిఐ జి.శ్రీనివాసరావును వివరణ కోరగా కుటుంబీకుల నుంచి ఎటువంటి ఫిర్యాదు అందలేదని, పోస్టుమార్టం రిపోర్టు ఆధారంగా కేసు నమోదు చేస్తామని చెప్పారు.

రాష్ట్ర బ్యాడ్మింటన్ పోటీల్లో 8 మంది ఎంపిక

విశాలాంధ్ర-సోంపేట : రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు సోంపేట నుంచి 8 మంది చిన్నారులు ఎంపికయ్యారు. ఆ చిన్నారులకు సోంపేట రోటరీక్లబ్ మరియు రోటరీ ఇన్‌డోర్ స్టేడియం బ్యాడ్మింటన్ ప్లేయర్ ఆధ్వర్యంలో గురువారం అభినందించారు. ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాసు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విద్యార్థులకు టీషర్టులు, బ్యాడ్మింటన్ షార్ట్‌లు అందించారు. రోటరీ క్లబ్ అధ్యక్షులు దుద్ది శ్రీనివాస్, నగిరి శరత్‌బాబు, బల్ల తారకేశ్వరరావు, శిక్షకులు తేజ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సదస్సులో ఐతమ్ విద్యార్థినుల ప్రతిభ

విశాలాంధ్ర-టెక్కలి: టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్మెంట్ ఇంజినీరింగ్ కళాశాలలో రెండవ ఏడాది ఎంబిఎ చదువుతున్న 8 మంది విద్యార్థినులు రెండు రోజుల పాటు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ యూనివర్శిటి శ్రీకాకుళంలో జరిగిన రాష్ట్ర స్థాయి సదస్సులో పాల్గొని నూతన ఆవిష్కరనలపై అధ్యయనం చేసి పేపర్లను సమర్పించి పలువురి ప్రశంశలు అందుకున్నారని కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి. నాగేశ్వరరావు గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలి పారు. 'ఇన్నోవేటివ్ టీచింగ్ అండ్ రీచెర్చ్ ప్రాక్టీసెస్ ఇన్ హయ్యర్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూటషన్స్ ఫర్ సస్టైనబుల్ డెవలప్మెంట్' అనే అంశంపై ఈనెల 18, 19 తేదీల్లో డాక్టర్ బిఆర్‌అంబేద్కర్ యూనివర్శిటీలో జరిగిన రాష్ట్ర స్థాయి సదస్సులో ఐతమ్ ప్రొఫెసర్ డాక్టర్ కె.వేణుగోపాల్ నాయకత్వంలో ద్వితీయ ఏడాది ఎంబిఎ చదువుతున్న విద్యార్థినులు కె.దివ్య, జె. అఖిల, కె. కరిష, ఐ. మౌనిక, కమ్మినాన దివ్య, ఐ.శ్రీదేవి, కె.సురేఖ, కె. పరిమళలు ఈ పేపర్లను ఆవిష్కరించారు. ఈ మేరకు సదస్సులో పాల్గొన్న వక్తలు, నిర్వహకులు ప్రశంశాపత్రాలను అందజేసి అభినందించారన్నారు. ముమ్ముందు మరిన్ని నూతన ఆవిష్కరణలు చేసి వ్యక్తిగతంగా అభివృద్ధి చెందుతూ, ఐతమ్ సంస్థకు మంచి పేరు తీసుకురావాలని డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, ఎంబిఎ హెచ్ఓడి డాక్టర్ బి.శివకుమార్లు కోరారు.

ప్రతి ఇంటికి ప్రభుత్వ సేవలు

విశాలాంధ్ర-సోంపేట : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వినూత్న కార్యక్రమాల ద్వారా ఇంటింటికి ప్రభుత్వ సేవలు అందుతున్నాయని ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాసు అన్నారు. ఈ మండలం సుంకిడి, ఎంజీపురం గ్రామాల్లో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమాల్లో డాక్టర్ దాసు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో పరిపాలన విస్తరణ ప్రతి పల్లెకు చేరిందని అన్నారు. తాజాగా సురక్ష కార్యక్రమం ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందించేందుకు కృతనిశ్చయంతో కృషి జరుగుతుందన్నారు. అవసరమైన ప్రతి ఒక్కరికి జగనన్న సురక్ష ద్వారా వివిధ రకాల ధృవపత్రాలు ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. జగనన్న పాలనలో నూతన సంస్కరణలు తీసుకువచ్చి అభివృద్ధి విప్లవం సృష్టిస్తున్న వైఎస్ జగన్‌ను అందరు ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులకు ఆర్‌బికె ద్వారా ఎరువులను అందజేశారు. సర్పంచ్ శిలగాన భాస్కరరావు, ఎంజీ పురం సర్పంచ్ సకలబత్తుల హరీష్, పిఏసిఎస్ చైర్మన్ రౌతు విశ్వనాథం, ఎఎంసి చైర్మన్ బదకల మోహనరావు, జెసిఎస్ కన్వీనర్ బుద్దాన శ్రీకృష్ణ, ఎంపిడిఓ బెందాళం వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

వీఆర్ఏలు ధర్నా

విశాలాంధ్ర-కవిటి/కంచిలి: అపరిష్కృతంగా ఉన్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరుతూ గురువారం కంచిలిలో వి.ఆర్.ఏ లు ధర్నా నిర్వహిన్చారు. వీఆర్ఏలకు స్థానిక సిఐటియు నాయకుడు సంగారు లక్ష్మీనారాయణ సంఘీభావం తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీఆర్ఏలకు పే స్కేల్ అమలు పరచాలని, వీఆర్వోలుగా పదోన్నతులు కల్పించాలని కోరారు. వీటితోపాటు న్యాయమైన వారి సమస్యలు పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు పిట్ట కృష్ణ, లోకనాదం, రమేష్ తో పాటు స్థానిక వీఆర్ఏలు పాల్గొన్నారు.

సంతబొమ్మాళిలో : తహసిల్దార్ కార్యాలయం ముందు గురువారం నిరసన దీక్షలు చేపట్టారు. అర్హులైన వీఆర్ఏలను వీఆర్వోలుగా పదోన్నతి కల్పించాలని వారు డిమాండ్ చేశారు. అలాగే తగిన పేస్కేల్‌ను ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్ఏల సంఘం ప్రతినిధులు దొంక అప్పారావు, మోహన్, రమేష్, శంకర్రావు, శ్యామలరావుతో పాటు పలువురు వీఆర్ఏలు పాల్గొన్నారు.

గ్రామాల్లో దివ్యాంగుల గుర్తింపు

విశాలాంధ్ర-కవిటి: మండలంలో సిడబ్ల్యుఎస్ఎన్ సర్వేలో భాగంగా దివ్యాంగులను గుర్తించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు కవిటి మండల విద్యాశాఖ అధికారి ధనుంజయ మజ్జి సిఆర్పి లకు, పార్ట్ టైం ఇన్స్ట్రక్టర్లు, ఐ ఈ ఆర్ టి ల తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గురువారం ఐ ఈ ఆర్ టి అమ్మృత కృష్ణ, బిజీ పుట్టుగ పార్ట్ టైం ఇన్స్ట్రక్టర్ బల్లెడ రమేష్ బి. గొనపపుట్టుగ, బాలాజీ పుట్టుగ, నర్సుపుట్టుగ, కంభేపుట్టుగ గ్రామాలలో సర్వే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా బిజీ పుట్టుగ రజక వీధిలో మామిడిపల్లి నితిన్ ని గుర్తించారు. ఆ విద్యార్థి యొక్క వివరాలను ప్రశస్త యాప్ లో పొందుపరచి తద్వారా ఆ విద్యార్థికి ప్రభుత్వం నుంచి కొన్ని సహాయాలు అందుతాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిఆర్పిలు తులసి, తనూజ, రామకృష్ణ, రామారావు, పార్ట్ టైం ఇన్స్ట్రక్టర్స్ బి సాయి, దుర్గాప్రసాద్, తిరుపతిరావు, తేజవతి, దీనారావు, లోకనాథం, ఆనంద్, ఈశ్వరరావు పాల్గొన్నారు.

నిర్ణీత గడువులోగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి : స్పీకర్

విశాలాంధ్ర-ఆమదాలవలస: నిర్ణీత గడువులోపు ఇల్లు నిర్మాణాలు పూర్తి చేయాలని దానికి అధికారి యంత్రాంగం సన్న ద్ధం కావాలని ఆంధ్రప్రదేశ్ శాసన సభాపతి తమ్మినేని సీతారాం పేర్కొన్నారు. ఆమదా లవలస స్పీకర్ క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గానికి సంబంధించి నాలుగు మండలాలు మరియు మున్సిపాలిటీ సంబంధించి హౌసింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. గాజుల కొల్లివలస లో సుమారు 1734 ఇళ్ల పట్టాలు మంజూరు చేసామన్నారు. ఇల్లు నిర్మాణాలు ఏ దశలో ఉన్నాయని అడిగి తెలుసు కున్నారు. అదేవిధంగా పొందూరు, బూర్జ, సరుబుజ్జిలి లో వేసిన లేఅవుట్ లో ఇల్లు నిర్మాణలు ఎ దశలో ఉన్నాయో స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్పీకర్ తమ్మినేని మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇల్లు కట్టుకునే లబ్ధి దారుల కు కోట్లు బిల్లులు చెల్లించింద న్నారు. అందు లో సిమెంటు ఐరన్ మొదలగు నిర్మాణ సామాగ్రికి కూడా ప్రభుత్వమే చెల్లిస్తుంద న్నారు. రాష్ట్రంలో 31 లక్ష పట్టాలి చ్చామని అందులో 15 లక్షల ఇల్లు నిర్మాణం శంకుస్థాపన పూర్తిచేసుకుని నిర్మాణ దశలో ఉన్నాయన్నారు. ఈ గృహాలన్నీ త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ గణపతి, డి ఈ అప్పారావు, ఏ ఈ లు లక్ష్మి నారాయణ, సన్యాసిరావు, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

విశాలాంధ్ర-సరుబుజ్జిలి : శుక్రవారం ఉదయం 8.00 గంటల నుండి 12.00 గంటల వరకు,11 కె.వి రొట్టవలస ఫీడర్ పరిధిలో , రొట్టవలస గ్రామం నుండి పురుషోత్తపురం, అలమజీపేట, కొండవలస, పెద్ద పాలేము, మరియు పాలవలస గ్రామ ప్రాంతలలో చెట్లు కొమ్మలు తొలగించే పనులు జరుగుతున్నందున, ఈ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని, విద్యుత్ వినియోగదారులు గమనించి విద్యుత్ శాఖకు సహకరించాలని. విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్. బయ్యన్నాయుడు తెలియజేశారు.

ఉపాధి పనుల్లో వేతనదారుల సంఖ్య పెంచాలి : సిఆర్‌డి ఏసీ జ్యోతి

విశాలాంధ్ర-ఎచ్చెర్ల: మహాత్మా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో వేతనదారుల సంఖ్యను పెంచేలా చర్యలు చేపట్టాలని సి ఆర్ డి అసిస్టెంట్ కమిషనర్ ఉపాధి హామీ జిల్లా ప్రత్యేక అధికారి జ్యోతి అన్నారు. మండలంలోని బొంతలకోడూరు గ్రామంలో అమృత సరోవర్ చెరువును గురువారం ఆమె పరిశీలించారు ఉద్యానవన పనులు, చెరువు మరమ్మత్తు పనులు చేపట్టాలన్నారు. జిల్లాలో అమృత సరోవర్ కార్యక్రమంలో భాగంగా 86 చెరువులను అభివృద్ధి చేసినట్లు పిడి జిబి చిట్టిరాజు ఆమెకు వివరించారు. రాబోయే రోజుల్లో ఈ చెరువుల మరింత అభివృద్ధికి రూ.2 లక్షల వరకు ఇస్తామన్నారు. కార్యక్రమంలో ఏపీఓ శోబాదేవి, సర్పంచ్ పంచి రెడ్డి రాంబాబు, ఎంపీటీసీ మాడుగుల జగదీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రవీంద్ర భారతి స్కూల్లో అక్షరాభ్యాస కార్యక్రమం

విశాలాంధ్ర-పాతపట్నం : స్థానిక రవీంద్ర భారతి పాఠశాలలో నేడు గురువారం" అక్షరాభ్యాసం" అనే కార్యక్రమం జరిగింది. ఈ పూజా కార్యక్రమంలో పలువురు తల్లిదండ్రులు తమ తమ చిన్నారులతో మొదటి సారిగా అక్షరాలను దిద్దించి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రములు పాఠశాల డీన్ నాగరాజు చిన్నారులను ఆశీర్వదించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయలు జి ప్రభాకర్ మాట్లాడుతూ చిన్నారులు తమ తమ భావి జీవితాలని ఉన్నతంగా తీర్చి దిద్దుకోవాడానికి మొదటి అడుగే ఈ పవిత్ర అక్షరాభ్యాసం అని తెలియ జేశారు.

మున్సిపల్ ఆప్కాస్ సిబ్బందిని పర్మినెంట్ చేయాలి : సీఐటీయు

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: మున్సిపల్ ఆప్కాస్ సిబ్బందినందరిని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పర్మినెంట్ చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నగర అధ్యక్షులు అరుగుల.గణేష్ డిమాండ్ చేశారు. గురువారం శ్రీకాకుళం నగర పాలక సంస్థ కార్యాలయం ఎదుట మున్సిపల్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, సి.పి.ఎస్ రద్దుచేయాలని, క్లాప్ డ్రైవర్లకు రూ.18,500 వేతనం ఇవ్వాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్‌రెడ్డి 2019 ఎన్నికలకుముందు ప్రతిపక్ష నేతగా అసెంబ్లీలోను, బయట పాదయాత్రలోను మున్సిపల్ ఉద్యోగులు, కార్మికులకు అనేక హామీలిచ్చారని అన్నారు. మన ప్రభుత్వం వచ్చిన వెంటనే వారం రోజుల్లో సి.పి.ఎస్. రద్దు చేస్తానన్నారు, ఉద్యోగులకు మెరుగైన పి.ఆర్.సి. ఇస్తానన్నారు, కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ సిబ్బందినందరిని 6 నెలల్లో పర్మినెంట్ చేస్తామని హామీ ఇచ్చారు కానీ నేటికీ అమలు చేయలేదన్నారు. మున్సిపాలిటీలలో దశాబ్ద వ్యవస్థ రద్దు చేస్తామన్నారు. మున్సిపల్ కార్మికులకు నెలకు లక్ష రూపాయలు జీతం ఇచ్చినా తక్కువే అన్నారు. అమ్మ కూడా చేయలేని పనులు వీరు చేస్తున్నారన్నారు. చంద్రబాబు ప్రభుత్వం కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను మోసం చేసిందని విమర్శించారు. నమ్మి ఓట్లేసి గెలిపించిన మున్సిపల్ కార్మికులను నట్టేటముంచారని విమర్శించారు. జూలై 20, 21న మున్సిపల్ ఆఫీసుల వద్ద మహా ధర్నాలు సామూహిక రిలే నిరాహార దీక్షలు, జూలై 27: పనులు బంద్ చేసి మున్సిపల్ ఆఫీసులు ముట్టడి కార్యక్రమం నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఆగస్టు 7 పనులు బంద్ చేసి -కలెక్టరేట్ల ముట్టడి చేపట్టాలని ప్రభుత్వం అప్పటికీ స్పందించకపోతే ఆగష్టు 15 తర్వాత రాష్ట్ర వ్యాపిత నిరవధిక సమ్మె విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎ.పి. మున్సిపల్ వర్కర్స్ & ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు కళ్యాణ.రాజు, ఆకుల.శంకర్, శేఖర్, డి.మాధవి, యాదమ్మ, భాగ్యం గురుస్వామి, ఎం.నారాయణరావు, తేజ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధే ఎజెండాగా మంత్రి డా.సీదిరి అడుగులు

నాలుగేళ్లలో రూ.1100 కోట్ల రూపాయల అభివృద్ధి పనులు

విశాలాంధ్ర-పలాస : పలాస నియోజకవర్గంలో గత నాలుగేళ్లలో రూ.1100 కోట్ల రూపాయలు నిధులతో పలాస ఎమ్మెల్యే, రాష్ట్ర మత్స్య, పశుసంవర్ధక శాఖా మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అభివృద్ధి పనులు చేపట్టి అడుగులు ముందుకు వేస్తున్నారు. మరో 9 నెలల్లో రాబోయే సార్వత్రిక ఎన్నికలకు అభివృద్ధే ఎజెండాగా ముందుకు దూసుకుపోయే ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. ఉద్దానం కిడ్నీ రోగుల కోసం 50 కోట్ల రూపాయలతో నిర్మిస్తున్న 200 పడకల కిడ్నీ ఆసుపత్రితోపాటు కిడ్నీ పరిశోధన కేంద్రం ప్రారంభానికి సిద్ధమవుతుంది. స్వయంగా ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి చేతులమీదుగా ప్రారంభించేందుకు మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు సన్నహాలు చేస్తున్నారు. వైసీపీ పార్టీ అధిష్టానం వద్ద సూచనలు, ప్రభుత్వ మార్గదర్శకాలు అనుగుణంగా సి.ఎం వై.ఎస్.జగన్ ఆదేశాలతో మంత్రి సీదిరి పలాస నియోజకవర్గంలో దూసుకుపోతున్నారు. ప్రభుత్వ ఆదేశాలతో పంచాయితీల్లో గడపగడపకు కార్యక్రమంతో పాటు గుడ్‌మార్నింగ్ కార్యక్రమాలు చేపట్టి నిరంతరం ప్రజల మధ్యనే ఉంటూ సమస్యలు పరిష్కరిస్తూ పాటు పడుతున్నారు. ప్రస్తుత రాజకీయ పార్టీలకన్నా గ్రామాల్లో ఆయన పర్యటిస్తూ ప్రజా సమస్యలను తెలుసుకుంటు న్నారు. ముఖ్యంగా టీడీపీ ఇక్కడ బలహీనంగా ఉన్నట్లు ఇంటలిజెన్సీ వర్గాల అంచనా వేయడంతో మంత్రి సీదిరి మరింత దూకుడు పెంచుతున్నారు. తాజా రాజకీయ పరిణామాలతో రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపి పొత్తు ఉండే అవకాశాలు ఉండడంతో ఆయన మరింత ఎక్కువగా శ్రమించాల్సి వస్తుందని వైసీపీ వర్గాలు అంటున్నాయి. పలాస నియోజకవర్గం 2009లో ఏర్పడిన తరువాత మునుపెన్నడు లేని విధంగా అభివృద్ధి, ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు డాక్టర్ సీదిరి అహర్నిశలు శ్రమిస్తూ ప్రజల అభిమానాన్ని చూరగొంటున్నారని, పార్టీ వర్గాలు పేర్కొంటు న్నాయి. డాక్టర్ సీదిరి హయాంలో జరిగిన అభివృద్ధిలో పలాస రైల్వే ఫ్లైఓవర్ వంతెన పనులు పనులు వేగవంతమవుతున్నాయి. కాశీబుగ్గ-అక్కుపల్లి వయా వజ్రపుకొత్తూరు రహదారి పనులు, 700 కోట్ల రూపాయలతో ఉద్దానం శుద్ధజల ప్లాంట్లు, సమగ్ర మంచినీటి పథకం పనులు కూడా ముమ్మరంగా జరుగుతున్నాయి ఎన్నికల ముందు ఇవి పూర్తయ్యే పరిస్థితులు కనిపించడంలేదు. ఆఫ్‌షోర్ రిజర్వాయరు పనులకు నిధులు మంజూరు చేసినా పనులు నత్తనడకగా కొనసాగుతున్నాయి. మరో ఐదేళ్లకు గాని ప్రాజెక్టు పూర్తి అయ్యే దాఖలాలు లేవని, నిర్వాసితులు పేర్కొంటున్నారు. ఎన్నికల ముందు డాక్టర్ సీదిరి ప్రజలకు ఇచ్చిన హామీల్లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు, పూండి, బ్రాహ్మణతర్లా ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఏర్పాటు, రూ.5 కోట్లతో పలాస ప్రభుత్వాసుపత్రి ఆధునీకరణ పనులు చేయగలిగారని పలువురు భావిస్తున్నారు. ఈ అభివృద్ధి పనులతో వచ్చే ఎన్నికల్లో ప్రతిపక్ష పార్టీలను ఎదుర్కొనేందుకు పావులు కదుపుతున్నారు. తన విజయానికి తాను చేస్తున్న అభివృద్ధి పనులతోపాటు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దోహదపడతాయని మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు భావిస్తున్నారు. గత ఎన్నికల్లో ఆయన విజయానికి కృషి చేసిన ద్వితీయ శ్రేణి నాయకులు దూరమైనా ప్రజల మాత్రం తనకు దగ్గరగా ఉన్నారని, అదే తన విజయానికి శ్రీరామ రక్షగా ఉంటుందని తన అంతరంగికుల వద్ద మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు పేర్కొన్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా తన ప్రత్యర్థి తెలుగుదేశం పార్టీ అభ్యర్థి గౌతు శిరీషా తనకు పోటీ కాదని డాక్టర్ సీదిరి భావిస్తున్నా నియోజకవర్గంలో టీడీపీ కూడా రోజురోజుకు పుంజుకోవడంతో దానిని అధిగ్వక్తు పేసేందుకు మంత్రి డాక్టర్ సీదిరి వ్యూహాలకు రచిస్తున్నట్లు సమాచారం. ఏదిఏమైనా రాబోయే అసెంబ్లీ ఎన్నికలు పలాస నియోజకవర్గంలో రసవత్తరంగా మారే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

ప్రజల వద్దకే ప్రభుత్వ పాలన

- ఇదే జగనన్న సురక్ష కార్యక్రమం ఉద్దేశం
- ఏపీ శాసనసభాపతి తమ్మినేని సీతారాం

విశాలాంధ్ర-ఆమదాలవలస: ప్రభుత్వ యంత్రాంగం నేరుగా మీ ఇంటికి వచ్చి, మీ సమస్యలను అడిగి తెలుసు కుని,వాటి పరిష్కారానికి అవసరమైన ధృవీకరణ పత్రాల పంపిణీ చేయడమే సురక్ష కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని ఆంధ్రప్రదేశ్ శాసనసభాపతి తమ్మినేని సీతారాం పేర్కొ న్నారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలో గేటు మరియు పాత ఆమదాలవలస కు సంబంధించి ఆమదాలవలస మార్కెట్ యార్డులో జరిగిన జగనన్న సురక్ష కార్య క్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు, నిరుద్యోగులు ప్రభుత్వ ధ్రువీకరణ పత్రాల కోసం రోజుల తరబడి కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి నుంచి నేరుగా మీ చెంతకే ప్రభుత్వ ధ్రువీకరణ పత్రాలను అందిస్తున్న సరికొత్త ఆలోచన ఇది అన్నారు. సంక్షేమ పథకాలు పొందేందుకు అవసరమయ్యే ధ్రువపత్రాలు లేనివారిని గుర్తించి, వారికి ఇళ్ల వద్దే అవసరమైన ధ్రువపత్రాలు అందించడం జరుగుతుందన్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి అనుబంధంగా జగనన్న సురక్ష కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి శ్రీకారం చుట్టారన్నారు. దీర్ఘకాలికంగా పరిష్కారం కాని ఎన్నో సమ స్యలకు, ఈ కార్యక్రమం ద్వారా పరిష్కారం లభిస్తుందన్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రా నికి చెందిన ఏ ఒక్క పౌరుడైన, తమ సమ స్యలను విన్నవిస్తే, వాటికి పరిష్కారం చూపించిన ఘనత జగన్మోహన్ రెడ్డి సర్కార్ లో లభిస్తుంద న్నారు. ప్రతి పౌరుడు తమకు జరిగిన అన్యాయాన్ని ఉన్నతాధికారులకు మెయిలు రూపంలో సమర్పిస్తే, వాటి పరిష్కారానికి రోజుల తరబడి, నెలల తరబడి తిరిగే వారన్నారు. ఆ పరిస్థితి పోయి ఒక టోల్ ఫ్రీ నెంబర్ కు, ఫోన్ కాల్ ద్వారా సమస్యను వివరిస్తే, వాటికి పరిష్కారం చూపే వ్యవస్థకు శ్రీకారం చుట్టారన్నారు. ఇది దేశంలోనే చారిత్రాత్మకమైన నిర్ణయంగా స్పీకర్ పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కార సాధన విషయంలో జె సి ఎస్ కన్వీనర్ల సహకారంతో వాలంటీర్లు చిత్త శుద్ధితో పనిచేస్తున్నారన్నారు. సచివాల యాల పరిధిలో నివాస సముదాయంలో గృహాలను వాలంటీర్ల బృందం సందర్శించా రని, వివరాలు సేకరించారన్నారు. వచ్చిన దరఖాస్తులకు సమస్యల పరిష్కారం ధ్రువీకరణ పత్రాలు సత్వరమే చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవి సుధాకర్ మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ బొడ్డేపల్లి రమేష్ కుమార్, స్థానిక నాయకులు సచివాలయాలకు కొఆర్డినేటర్ అల్లం శెట్టి ఉమామహేశ్వరరావు, జె కె వెంక బాబు, దుంపల శ్యామలరావు, పట్టణ పార్టీ అధ్యక్షులు పొడుగు శ్రీను, నవపం రాజు, బొడ్డేపల్లి రాజు,సారు చిరంజీవి, మామిడి రమేష్ కుమార్, సువ్వారి వెంకటరమణ తదితర వైయస్ఆర్ పార్టీ నాయకులు కార్య కర్తలు అధికారులు సచివాలయ సిబ్బంది వాలంటీర్లు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబాన్ని ఆదుకోవడమే ధ్యేయం

విశాలాంధ్ర-వజ్రపుకొత్తూరు: వైసీపీ ప్రభుత్వం పేదల పక్షమని, ప్రతి కుటుంబాన్ని సంక్షేమ పథకాలతో ఆదుకోవడమే ధ్యేయమని ఎంపిపి ప్రతినిధి ఉప్పరపల్లి ఉదయ్‌కుమార్ అన్నారు. గురువారం సువ్వరలేవ్వ గ్రామంలో సర్పంచ్ ముఖ్యల ఎజ్జా, ఉపసర్పంచ్ దేవా ఆధ్వర్యంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమని, అందరికీ సంక్షేమ పథకాలు అందివ్వడమే లక్ష్యంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని అన్నారు. పథకాలు అందని వారు ఎవరైనా ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని అన్నారు. కౌల రైతులకు హక్కు పత్రాలు అందించడం ద్వారా వైసీపీ ప్రభుత్వం సాహసోపేతమైన నిర్ణయం తీసుకుందని అన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ బి.అప్పల స్వామి, ఐవోపిఆర్ డి.తిరుమలరావు, ఎంపిటిసి శ్రీనివాస్, రామకృష్ణ, సొసైటీ అధ్యక్షులు నీలాంబర్, ముఖ్యల మోహనరావు, అదిల్ షా, వీఆర్వో అరుణలు పాల్గొన్నారు.

పలాస : జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా గురువారం మండలం లొద్దభద్ర గ్రామంలో నిర్వహించిన ఈ సందర్భంగా వైసీపీ నాయకులు చింతాడ మాధవరావు మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అందని పేదలు ఎవరైనా ఉంటే ఈ కార్యక్రమంలో తెలియజేయాలని, వారికి వెంటనే ప్రభుత్వ పథకాలు అందించేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారని అన్నారు. వైసీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలతో పేదవాలను ఆదుకుంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఓ రమేష్‌నాయుడు, తహశీల్దార్ మధుసూదనరావు, రాజేష్‌రెడ్డి, ఫ్రాన్సిస్‌లు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు అందాలన్నదే జగనన్న ధ్యేయం : ఎమ్మెల్యే రెడ్డి శాంతి

విశాలాంధ్ర-హిరమండలం: అర్హులై ఉండి ఏ కారణం చేతనైనా ఇంకా ఎవరైనా మిగిలిపోతే వారికి కూడా సంక్షేమ పథకాలు అందాలన్న మహోన్నత లక్ష్యంతో సంక్షేమ పథకాలు, ప్రజా సమస్యలు సంతృప్తి స్థాయిలో పరిష్కార లక్ష్యంగా జగనన్న ప్రభుత్వం తీసుకొచ్చిన "జగనన్న సురక్ష" వినూత్న కార్యక్రమమని ఎమ్మెల్యే శాంతి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని హిరమండలం-3 గ్రామ సచివాలయ ఆవరణం లో "జగనన్న సురక్ష" కార్యక్రమం పాతపట్నం నియోజకవర్గశాసన సభ్యురాలు రెడ్డి శాంతితో పాల్గొని లబ్ధిదారులకు ఈ కార్యక్రమ సదుపాయం మాట్లాడుతూ కుల, మత, వర్గ, పార్టీలకు అతీతంగా లంచాలకు, వివక్షకు తావు లేకుండా నూటికి నూరు శాతం సంతృప్తి స్థాయిలో పారదర్శకంగా సంక్షేమ ఫలాలు అందించాలన్నదే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని ఎమ్మెల్యే రెడ్డి శాంతి తెలిపారు. అనంతరం అర్హత ఉండి కూడా సంక్షేమ పథకాలు పొందని లబ్ధిదారుల సమస్యలను పరిష్కరించేందుకు గాను అవసరమైన సర్టిఫికెట్లను సేవా ఛార్జీలు లేకుండా 565 మందికి, శాసన సభ్యురాలు రెడ్డి శాంతి అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్సార్సీపీ మండలఅధ్యక్షులు మీసాల రామకృష్ణ, జగనన్న జె ఎస్ సి మండల కన్వీనర్ ఎవి సుబ్బారావు, సర్పంచ్ డి సుందరమ్మ, సచివాలయకన్వీనర్ లు వై శేఖర్, రెడ్డి, ఎర్ర భాస్కర్ రావు, గృహ సారథులు, గ్రామ వాలంటీర్లు, సచివాలయసిబ్బంది, వైస్సార్సీపీ నాయకులు మీసాల భాస్కర్ రావు, మీసాల రామారావు, మీసాల శంకర్ రావు, మండలస్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వీఆర్ఏల సమస్యలు ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి

విశాలాంధ్ర-కోటబొమ్మాళి: రాష్ట్ర ప్రభుత్వం వీఆర్ఏల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ స్థానిక మండల తహశీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం వీఆర్ఏలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వీఆర్ఏ సంఘ నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర వీఆర్ఏ సంఘ నాయకులు ఆదేశాల మేరకు వీఆర్ఏలందరూ విధులకు హాజరు కాకుండా గురువారం, శుక్రవారం తహశీల్దార్ కార్యాలయం ముందు నిరసన తెలియజేయటం జరుగుతుందన్నారు. వీఆర్ఏలకు పేస్కేలు అమలు చేయాలని, నామినీలకు వీఆర్ఏలుగా గుర్తించాలని, రికవరీ చేసిన డీఏలను తిరిగి చెల్లించాలని, వీఆర్ఏ వృత్తిచెందితే కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోటబొమ్మాళి మండల గ్రామరెవెన్యూ సహాయకుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో సంఘ నాయకులు దేవాది లక్ష్మణరావు, గంగారావు ఆనందరావు, ఉర్జాన రాజారావు, నిమ్మాన రామారావు, కవిరి చిన్నారావు తదితరులు ఉన్నారు.

22న కిడ్నీ వ్యాధి నిర్ధారణకు ఉచిత వైద్య పరీక్షలు

జిల్లా వైద్య ఆరోగ్య అధికారిణి డా. బి.మీనాక్షి

విశాలాంధ్ర-శ్రీకాకుళం : 22వ తేదీ శనివారం కిడ్నీ వ్యాధి నిర్ధారణకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య అధికారిణి డా. బి.మీనాక్షి అన్నారు. ఈ నెల 22 శనివారం ఎంఎస్ పల్లి, మాకివలసరం పిహెచ్‌సిల్లో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ మరియు శ్రీకాకుళం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా ఆదేశిస్తాల మేరకు డీఎంహెచ్ వో డా. బి.మీనాక్షి ఆధ్వర్యంలో కిడ్నీ వ్యాధి నిర్ధారణకు ప్రత్యేక వైద్య పరీక్షల శిబిరం ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఈ శిబిరంలో ఉచిత రక్త పరీక్షలు మరియు ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య అధికారిణి డా. బి.మీనాక్షి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజలందరికి కిడ్నీ వ్యాధి నిర్ధారణ కోసం రక్త పరీక్షలు ఉచితముగా నిర్వహించి సీరం క్రియాటిన్ లెవెల్ పరీక్ష చేసి అవసరమైన వారికి మందులు కూడా ఉచితంగా సరఫరా చేయడం జరుగుతుందని, కావున పరిసర ప్రాంతాల ప్రజలందరూ ఈ అవకాశం వినియోగించుకొని ముందుగా రక్త పరీక్షలు చేయించుకుని వారి ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని కోరారు.

కార్యదర్శుల పనితీరుబట్టే అవార్డులకు గుర్తింపబడతారు

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : మండలంలో పంచాయతీ కార్యదర్శులు పనితీరును బట్టి ప్రభుత్వం ప్రకటించే అవార్డులకు ఎంపిక కాబడతారని టెక్కలి డివిజన్ పంచాయితీ అధికారి బివి. రమణ అన్నారు. ఆయన గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశమందిరంలో పంచాయితీ కార్యదర్శులతో స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులపై సమావేశం నిర్వహించారు. పంచాయితీల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహిస్తూ స్వచ్ఛతకు మారుపేరుగా నిలిచేవిధంగా చర్యలు చేపట్టాలని, అవార్డు ఎంపికకు గ్రామాలకు వచ్చే కమిటీల దృష్టిలో ఆ పంచాయితీ గ్రామాలు ఎటువంటి పిర్యాదులు లేకుండా చూడాలని, గ్రామాలలో పూర్తి స్థాయిలో పారిశుధ్యం నిర్వహించి ఆరోగ్యకరమైన వాతావరణం కలిగి ఉన్నట్లైతే స్వచ్ఛ సర్వేక్షణ్ ఎంపిక చేస్తారని, కార్యదర్శులు అదే విధంగా ఉండాలని సూచించారు. పారిశుధ్యలోపంతో ప్రబలే రోగాలపై ప్రజలకు అవగాహన కల్పించే విధంగా ఉండాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌సి అధికారి నాగరాజు, పంచాయితీ కార్యదర్శులు కె. క్రిష్ణారావు, బి. నరేష్ తదితరులు పాల్గొన్నారు.

వీఆర్ఏల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర-మెళియాపుట్టి : గత నాలుగు సంవత్సరాలు కాలంగా మా వీఆర్ఏల సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయని వాటిని పరిష్కరించాలని కోరుతున్నారు. వీఆర్ఏల రాష్ట్ర సంఘం పిలుపు మేరకు గురువారం వారు మండల కేంద్రంలో గల స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో నిరసన దీక్షలు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అప్పటి ప్రతిపక్ష పార్టీ నేత, ప్రస్తుత ముఖ్యమంత్రి అప్పట్లో ఇచ్చిన మా వీఆర్ఏల సంక్షేమానికై ఒక్క హామీని సైతం నెరవేర్చలేదని, మా వీఆర్ఏ ల సమస్యలను పరిష్కరించాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎన్నోమార్లు విన్నవించినప్పటికీ మా సమస్యలలో ఎటువంటి ఫలితం కనిపించలేదన్నారు. వీఆర్ఏల ప్రధాన సమస్య అయిన పేస్కేల్ అమలు చేయాలని, నామినీలను పనిచేస్తున్న వారందరినీ వీఆర్ఏలుగా గుర్తించాలన్నారు, అర్హులైన వీఆర్ఏలకు తదితర పోస్టుల్లో నియామకం చేపట్టాలని, డిఎ రికవరీని నిలిపి, డిఎతో కూడిన వేతనం అమలు చేయాలని పలు డిమాండ్ల పరిష్కరించాలని కోరుతున్నారు. రాష్ట్ర సంఘం పిలుపుమేరకు వారు నిరసన దీక్ష కార్యక్రమంలో పాల్గొన్నారు.

మిషన్ ఇంద్ర ధనుస్‌తో ఆరోగ్య ప్రయోజనం

విశాలాంధ్ర-పోలాకి: ఏడు ప్రాణాంతక వ్యాధులు డయ్యారా, డిప్తీరియా, కోరింత దగ్గ, పోలియో, క్షయ, తట్టు మరియు హెపటైటిస్ బి లాంటి ఏడు జబ్బులకు మిషన్ ఇంద్రధనస్సు వంటివి ఆరోగ్య ప్రయోజనం అని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ శ్రీనాథ్ అన్నారు. గురువారం పోలాకి ఆరోగ్య కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. ఏడు ప్రాణాంతక వ్యాధులు డయ్యారా, డిప్తీరియా, కోరింత దగ్గ, పోలియో, క్షయ, తట్టు మరియు హెపటైటిస్ బి లాంటి ఏడు జబ్బులకు ఇంద్రధనస్సులో ఏడు రంగులుగా 7వ్యాక్సిన్ లు వ్యాక్సిన్ తీసుకోని లేదా కొన్ని డోస్ లు మాత్రమే తీసుకున్న అందరు గర్భిణులు, పిల్లలకు అందించటం మిషన్ ఇంద్రధనస్సు సంకల్పం అని డాక్టర్ శ్రీనాథ్ పేర్కొన్నారు. పోలాకి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల వ్యాక్సిన్ వేయించుకొనని వృద్ధులను ఆశా కార్యకర్తలు గృహ సర్వే ద్వారా గుర్తించి వారికి ఆగస్టు నెల వ్యాక్సిన్ వేయనున్నామని డా. పల్లి రవికుమార్ ఆరోగ్య విస్తరణ అధికారి అన్నారు. 14 సచివాలయాల పరిధిలో గల దాదాపు 11వేల గృహలను ఆశా కార్యకర్తల సందర్శిస్తూ గర్భిణులు రెండు సంవత్సరాలలోపు పిల్లలు, ఐదు రెండు నుంచి ఐదు సంవత్సరాలలోపు పిల్లలు ఈ మూడు కేటగిరీలలో ఇమ్యూనైజేషన్ కాని వ్యక్తులను గుర్తించి వారికి వ్యాక్సినేషన్ చేయడమే దీనిలో ముఖ్య ఉద్దేశమని అన్నారు. ఈ సందర్భంగా గొల్లలవలస, అంపలం, డోల, ఉర్జా తదితర సచివాలయ ప్రాంతాలను రవికుమార్ సందర్శించారు. కార్యక్రమంలో పి హెచ్ ఎన్ ఈశ్వరమ్మ పర్యవేక్షకులు శేఖర్ బాబు లక్ష్మి, ఏఎన్ఎం హెల్త్ అసిస్టెంట్ ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష జనావాళికి నేస్తం

విశాలాంధ్ర-పొందూరు: రాష్ట్ర ప్రజల అభ్యున్నతి కోసం జగనన్న సురక్ష జనావాళికి నేస్తంగా నిలిచిందని ఇందులో భాగంగా మ్యారేజ్, మ్యారేజ్ సర్టిఫికేట్, కుల, ఆదాయ వంటి ధృవపత్రాల కోసం అధికారులు, కార్యాలయాలు చుట్టూ తిరగకుండా తమ దగ్గరకే వచ్చి అందించే అద్భుత కార్యక్రమం మా జగనన్న సురక్ష అని జెడ్పీటీసీ లోలుగు కాంతారావు అన్నారు. మండలం తోలాపి, తండ్యాం పంచాయతీలలో గురువారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ధృవపత్రాలను కేవలం ఇంటికి వచ్చి నమోదు చేయడం ద్వారా ఇంటి వద్దే పొందడం జరుగుతుందని మండల పార్టీ అధ్యక్షులు పప్పల రమేష్ కుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో తోలాపి సర్పంచ్ పప్పల అమ్మాయమ్మ, తండ్యాం ఎంపీటీసీ వడగా మోహన్, నాయకు లు కె. రమణమూర్తి, కిల్లి నాగేశ్వరరావు దుంపల శ్యామలరావు, బి. సునీల్, జి. నాగరాజు ఎం. పీడీవో హరిహరరావు, ఈవో జనార్ధనరావు తదితరులు పాల్గొన్నారు.

అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : ఎన్నికల నియమావళి, ఓటర్ లిస్టులు సవరణలకు సంబంధించిన అంశంపై, మండలంలో కల అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందని సంతబొమ్మాళి మండలం తహసీల్దార్ జె చలమయ్య అన్నారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు జీరు భీమారావు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కోత మధుసూదన్ రావు, వైకాపా పార్టీ కన్వీనర్ కోత నతీష్, జనసేన పార్టీ మండల కన్వీనర్ గుడ్డంయ భాస్కర్‌తోపాటు, ఇతర పార్టీలు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

వ్యవసాయ కళాశాలలో శ్రీ సత్య సాయి ప్రేమ తరు

విశాలాంధ్ర-ఎచ్చర్ల : మండలంలోని ఎస్ ఎస్ ఆర్ పురం సమీపంలోని శ్రీ కింజరాపు ఎర్రన్నాయుడు వ్యవసాయ కళాశాలలో శ్రీ సత్య సాయి బాబా శత జయంతి ఉత్సవాల్లో భాగంగా సత్యసాయి ప్రేమ తరు కార్యక్రమంలో గురువారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని శ్రీ సత్యసాయి సేవా సంస్థల అధ్యక్షుడు రఘుపాత్రుని లక్ష్మణరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కోటి మొక్కలు నాటే కార్యక్రమాన్ని లక్ష్యంగా నిర్ణయించుకున్నామన్నారు. ఈ వ్యవసాయ కళాశాల 1000 మొక్కలు నాటినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వై లింగరాజు రాష్ట్ర గ్రామ సేవ ఇన్చార్జి సత్యనారాయణ రాష్ట్ర యువ సమన్వయకర్త కళ్యాణ్ జిల్లా సేవాదళ్ సమన్వయకర్త సూర రామచంద్రరావు, ప్రేమ తరు జిల్లా ఇన్చార్జి బోయిన చంద్రమౌళి, వ్యవసాయ కళాశాల డైరెక్టర్లు డాక్టర్ బుడుమూరు శ్రీరామ్మూర్తి, డాక్టర్ బి వి ఎస్ ఎస్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

మానవతా దృక్పథంతో దివ్యాంగులకు చేయూతనివ్వండి

విశాలాంధ్ర-పొందూరు: దివ్యాంగుల అవసరాల బాధ్యతను ప్రతి చిన్నారి మానవతా దృక్పథంతో బాధ్యతగా పెంపొందించుకొని చేయూతనివ్వాలని ఐఈఆర్టీ కె. దివాకర్ అన్నారు. సీడబ్ల్యూఎస్ఎన్ సర్వేలో భాగంగా గురువారం మండలం తోలాపి గ్రామంలో వలంటీర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. దివ్యాంగ చిన్నారులను గుర్తించి వారికి ప్రత్యేక శిక్షణ కల్పించడం ద్వారా వారి ఉన్నతికి బాట వేయవచ్చని సిడబ్ల్యూఎస్ఎన్ సర్వే లక్ష్యం. అదేవిధంగా అన్నారు. ప్రత్యేక అవసరాలుగల చిన్నారులను గుర్తించి వారికి అవసరమైన విభాగంలో ప్రత్యే శిక్షణ, సౌకర్యాలు కల్పిస్తామన్నారు. వలంటీరు బాధ్యతగా దివ్యాంగచిన్నారులను గుర్తించి సహక రించాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి జనార్ధనరావు, వెల్ఫేర్ అసిస్టెంట్, పూర్ణారావు పాల్గొన్నారు.

కోర్కెల సాధన కోసం వీఆర్ఏలు నిరసన దీక్ష

విశాలాంధ్ర-పొందూరు: నేతలు ఎందరు మారినా, పట్టుగొడుగుల పెట్టలరెడి రంగు రంగు జెండాలు ఉద్యమిస్తున్న రెవిన్యూ యంత్రాంగానికి పెల్ల తరబడి సేవలందించే వీఆర్ఏల సమస్యల పరిష్కారానికి నోచుకోవడం లేదు. సమస్యల కోసం రాష్ట్ర వీఆర్ఏల సంఘం పిలుపుమేరకు తహశీల్దార్ కార్యాలయం ముందు రెండు రోజుల దీక్షలు వీఆర్ఏలు నిర్వహించారు. ఈ మేరకు వీఆర్ఏల సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి తండేల త్రినాధరావు మాట్లాడుతూ రెవెన్యూశాఖలో కీలకపాత్ర పోషిస్తున్న వీఆర్ఏ ల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోందని పోరాటంతోనే డిమాండ్ల పరిష్కారం సాధ్యమని రాష్ట్ర సంఘం తీసుకున్న నిర్ణయంతో భాగంగా రెండురోజుల పాటు నిరసన దీక్ష చేయనున్నామని తెలిపారు.

అధికారుల తీరుపై కలెక్టర్‌కు నివేదిక

విశాలాంధ్ర-జలుమూరు : సారవకోట మండలంలో కొందరు అధికారుల తీరుపై జిల్లా కలెక్టర్‌కు నివేదిస్తున్నట్లు ఎంపీడీవో డి.విశ్వేశ్వరరావు ప్రకటించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ చిన్నాల కూర్మినాయుడు అధ్యక్షతన బుధవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి గైర్హాజరైన ఐసిడిఎస్, వంశధార, అటవీ శాఖ, బొంతు, బుడితి ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్లు గైర్హాజరయ్యారు. దీనిపై కలెక్టర్‌కు నివేదిస్తున్నట్లు ఎంపీడీవో తెలిపారు.

కోర్టు కేసుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న పనులు వేగవంతం చేయాలని మున్సిపాలిటీ ప్రాంతీయ సంచాలకులు జి. నాగరాజు అన్నారు. గురువారం స్థానిక మున్సిపాలిటీ సందర్శించి పలు అంశాలకు సంబంధించి సమీక్ష నిర్వహించారు. కమిషనర్ ఎన్.రమేష్‌తో సమావేశంలో సిబ్బందితో మాట్లాడుతూ రికార్డులు సక్రమంగా నిర్వహించాలని అన్నారు. మున్సిపాలిటీ దాఖలు చేసిన కోర్టు కేసులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలని, అలాగే మున్సిపాలిటీ పై దాఖలైన కేసులు సత్వర పరిష్కారం జరిగి అనుకూల ఉత్తర్వులు ఉండేలా పనితీరు మెరుగుపర్చుకోవాలని సూచించారు. అనంతరం ఆయన్ని మర్యాదపూర్వకంగా కలుసుకున్న చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి మున్సిపాలిటీ అభివృద్ధికి [illegible] సహకారం అందివ్వాలని కోరారు.

జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు

విశాలాంధ్ర–పాతపట్నం: అర్హులై ఉండి ఏ కారణం చేతనైనా ఇంకా ఎవరైనా మిగిలిపోతే వారికి కూడా సంక్షేమ పథకాలు అందాలన్న మహోన్నత లక్ష్యంతో సంక్షేమ పథకాలు, ప్రజా సమస్యలు సంతృప్తి స్థాయిలో పరిష్కారించడమే లక్ష్యంగా జగనన్న ప్రభుత్వం తీసుకువచ్చిన "జగనన్న సురక్ష" వినూత్న కార్యక్రమంలో భాగంగా కాగువాడ గ్రామంలో మురళీకృష్ణ కళ్యాణ మండపంలో నందు నిర్వహించారు. "జగనన్న సురక్ష" కార్యక్రమంలో సర్పంచ్ నల్లి రాజారావు మాట్లాడుతూ జగన్ మోహన్ రెడ్డి నేతృత్వంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంక్షేమ పథకాలతో కుల, మత పార్టీలకు, రాజకీయాలకు అతీతంగా పేదప్రజల కు అండగా జనరంజక పాలన అందిస్తున్న ప్రభుత్వం జగనన్న ప్రభుత్వమేనని తెలియజేశారు. ఉప సర్పంచ్ మాట్లాడుతూ కాగువాడ రొంపివలస గ్రామాలకు ఆనుకొని 25 గ్రామాల ప్రజలు వంతెన లేక పడవ ప్రయాణం లో ఎన్నో ప్రాణాలు పోగొట్టుకున్నారు. ప్రజల పడుతున్న సమస్యలను గత ప్రభుత్వాల పాలకుల దృష్టికి ఎన్నోసార్లు తెలియజేసిన పట్టించుకునే నాథుడే లేకుండా పోయారని కానీ రెడ్డి శాంతి ఇచ్చిన మాట ప్రకారం కాగువాడ నుండి రొంపివలస కు జగనన్న ప్రభుత్వంలో ఆరు మాసాల్లో బ్రిడ్జి నిర్మించడం జరిగిందని త్వరలోనే బ్రిడ్జి ప్రారంభోత్సవం జరగబోతుందన్నారు. ఇది మన 25 గ్రామాల ప్రజల కష్టాలు విన్న రెడ్డి శాంతి ప్రత్యేక దృష్టి సారించి, ముఖ్యమంత్రి జగనన్న దృష్టికి తీసుకువెళ్లి నిధులు రాబట్టడమే కాకుండా ప్రత్యేక కాంట్రాక్టర్ లను జగన్ మోహన్ రెడ్డి ద్వారా తెప్పించి ఆరు మాసాలలోనే వంతెన నిర్మాణం పూర్తి చేసి ఆవిడ హయాంలోనే ప్రారంభం చేసుకోబోతున్నామని, అందుకు ఎంతో ఆనందంగా ఉందని ఆయన తెలియజేశారు. శాసన సభ్యురాలు రెడ్డి శాంతి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ కుల, మత, వర్గ, పార్టీలకు అతీతంగా లంచాలకు, వివక్షకు తావు లేకుండా. అర్హత ఉండి కూడా సంక్షేమ పథకాలు పొందని లబ్ధిదారుల సమస్యలను పరిష్కరించేందుకు గాను అవసరమైన సర్టిఫికెట్లను సేవా ఛార్జీలు లేకుండా 342 మందికి శాసన సభ్యురాలు రెడ్డి శాంతి అందజేశారు. ఈ కార్యక్రమంలో

స్పెషలాఫీసర్ ఎం కరుణాకర్ రావు, ఎంపీడీవో జయంతి ప్రసాద్, ఎమ్మార్వో కే రవిచంద్ర, ఈ ఓ పి ఆర్ డి నర్సింగ్ ప్రసాద్ పండ, ఏఎంసీ చైర్మన్ అర్జున్ రావు, ఏఎంసి వైస్ చైర్మన్ ఎం తాతయ్య, మండల అధ్యక్షుడు ఎస్ ప్రదీప్, జె ఎస్ సి కన్వీనర్ ఏనుగుతల సూర్యం, సర్పంచ్ నల్లి జగదీశ్వరరావు, శిస్తు తులసి నాయుడు, ఎం అప్పలనాయుడు, ఎంపీటీసీ అమర ఉషా, ఉప సర్పంచ్ గణపతి మధు బాబు, కోఆప్షన్ నెంబర్ మాధవ్ పల్లె, గంగువాడ పిహెచ్సి ఈఓ, కర్రి లక్ష్మినారాయణ, వైఎస్ఆర్సీపీ నాయకులు అమర రమణ, పి మోహన రావు, జి రాము, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు, హెల్త్ డిపార్ట్మెంట్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

చరిత్ర సృష్టించిన జగనన్న సురక్ష

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్

విశాలాంధ్ర–అరసవల్లి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'జగనన్న సురక్ష' కార్యక్రమం అపూర్వ రీతిలో ప్రజలకు ప్రభుత్వ సర్వీసులను అందించి సరికొత్త రికార్డు సృష్టించిందని పార్టీ జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ పేర్కొన్నారు. గురువారం సాయంత్రం నగరంలోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడారు. జగనన్న సురక్ష కార్యక్రమానికి సంబంధించిన వివరాలను తెలియజేశారు. ప్రజలకు అవసరమైన సేవలు అందించే ఇలాంటి కార్యక్రమాలతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గొప్ప చరిత్ర సృష్టించినందుకు చాలా సంతోషంగా ఉందని అనారు. గత ప్రభుత్వాలు ఇలాంటి రికార్డులు కాదుకదా... కనీసం అలోచించిన దాఖలాలు లేవన్నారు. జగనన్న సురక్ష తరహా కార్యక్రమాలను ఇతర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయాలని భావిస్తున్నాయని, అటువంటి వారికి మన రాష్ట్ర ప్రభుత్వం ఒక ఉదాహరణగా నిలిచిందన్నారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని జూన్ 23న సీఎం జగన్ లంఛనంగా ప్రారంభించారని, సంక్షేమ పథకాలు, డాక్యుమెంట్/సర్టిఫికెట్ జారీ, ఫోన్ నెంబర్ కు ఆధార్ లింక్ లేదా ప్రభుత్వ పథకాలు సేవలు అందుకోవడంలో ఉన్న సమస్యలను పరిష్కరించడం కోసం ప్రతి కుటుంబాన్ని సంప్రదించి, వారు ఏవైనా సమస్యలను ఎదుర్కొంటున్నారా అని అడిగి పరిష్కరించే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. జగనన్న సురక్ష శిబిరాలను ఇప్పటివరకు 15,004 సచివాలయాలకు గాను ప్రభుత్వం 10,700 సచివాలయాల పరిధిలో నిర్వహించిందన్నారు. ఈ శిబిరాల ద్వారా 27 లక్షల(27,32,866) ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్లు, 24 లక్షల (24,46,599) ఆదాయ ధృవీకరణ పత్రాలు, 3,159 ఓబీసీ సర్టిఫికెట్లు, 5,199 ఫ్యామిలీ సర్టిఫికెట్లు జారీ అయ్యాయని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా జగనన్న సురక్ష కోసం సర్వే చేయబడిన మొత్తం 1.17 కోట్ల కుటుంబాలకు గాను, 57.3 లక్షల కుటుంబాలకు ధ్రువ పత్రాలు అందించి నేరుగా ప్రయోజనం చేకూర్చామన్నారు. ఈ నెల 18న ఒకే రోజులో 6,87,863 సర్టిఫికెట్లు జారీ చేసి రాష్ట్ర ప్రభుత్వం సరికొత్త రికార్డు సృష్టించిందని తెలిపారు. గతంలో ఏ ప్రభుత్వమూ ప్రయత్నించని, సాధించని ఘనతను మన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సాధించిందనీ కృష్ణదాస్ వివరించారు.

మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు మాట్లాడుతూ ఈ భారీ విజయాన్ని సాధించిన ఘనత ప్రతి గ్రామ వాలంటీర్ కు కూడా చెందుతుందన్నారు. ప్రజల్లో అవగాహనను పెంపొందించేందుకు వాలంటీర్లు అవిశ్రాంతంగా పనిచేస్తున్నారన్నారు. ఈ వాలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను ముందస్తుగా అడిగి తెలుసుకుని, క్యాంపు షెడ్యూల్ గురించి వారికి తెలియజేసి, ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న సేవలను వివరిస్తున్నారని, రాష్ట్రంలో అర్హత ఉన్న ఏ ఒక్కరూ సంక్షేమ పథకాలు అందకుండా ఉండరాదన్న మహోన్నత లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమం జగనన్న ప్రభుత్వ నిబద్ధతకు ఉదాహరణగా నిలిచిందన్నారు. జగనన్న 'చెప్పాడంటే – చేస్తాడంతే' అని నమ్ముతున్న మా ప్రభుత్వ రిపోర్ట్ కార్డ్‌కి జగనన్న సురక్షతో మరో ఘనత జోడించినట్లయిందని వివరించారు. ఈ మీడియా సమావేశంలో మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు, ఎంఎల్సీలు నర్తు రామారావు, దువ్వాడ శ్రీనివాస్, ఎమ్మెల్యే రెడ్డి శాంతి, ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్, కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ కిల్లి కృపారాణి, డిసిసిబి చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, సుడా చైర్మన్ కోరాడ ఆశాలత గుప్తా తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ ఏయూకి ఐఎస్ఓ గుర్తింపు కొనసాగింపు

విశాలాంధ్ర–ఎచ్చర్ల : బీ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యూనివర్సిటీకి నోయిడా (ఉత్తర ప్రదేశ్)కు చెందిన కెవి క్యూఏ సర్టిఫికేషన్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ ఇచ్చే ఐఎస్ఓ 9001:2015 గుర్తింపును 2025 సంవత్సరం వరకు కొనసాగిస్తూ ఆ సంస్థ సర్టిఫికెట్ అందజేసిందని వి సి ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు తెలిపారు. ఆయన గురువారం మాట్లాడుతూ నాణ్యమైన ప్రమాణాలు, మెరుగైన ప్రజా సంబంధాలు, పారదర్శక సేవలు, పాలనలో సాంకేతికత తదితర అంశాలను పరిశీలించి వర్సిటీకి ఐఎస్ఓ గుర్తింపును కొనసాగించింది అన్నారు. వర్సిటీకి తొలిసారి 2016లో ఐఎస్ఓ గుర్తింపు లభించిందని, గుర్తింపు పొడిగించాలని ఆ సంస్థకు దరఖాస్తు చేసామన్నారు. దీంతో ఆ సంస్థ ఆన్లైన్లో వర్సిటీకి సంబంధించిన పత్రాలను పరిశీలించి కొనసాగింపు ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఈ గుర్తింపు పత్రాన్ని విసి ప్రొఫెసర్ వెంకటరావు వర్సిటీ ఐక్యూ ఏసి కోఆర్డినేటర్ డాక్టర్ కే స్వప్న వాహిని కి అందజేశారు.

నాలుగేళ్ల సమీకృత ఉపాధ్యాయ విద్యకు కరికులం పై వర్క్‌షాప్ : నూతన జాతీయ విద్యా విధానంలో భాగంగా దేశంలో ఆరు రాష్ట్రాల్లో 11 విద్యాసంస్థలకు నాలుగేళ్ల సమీకృత ఉపాధ్యాయ విద్య కోర్సు మంజూరయిందని విసి ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు తెలిపారు. ఇందులో భాగంగా ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని రాష్ట్రీయ యూనివర్సిటీలో కేవలం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యూనివర్సిటీకి మాత్రమే ఈ కోర్స్ మంజూర అయింది అన్నారు. ఈ ప్రాంతంలో ఉపాధ్యాయ విద్యకున్న డిమాండ్ దృష్ట్యా ఈ కోర్సు మంజూరుకు కృషి చేశామన్నారు. ఈ కోర్సులో చేరేందుకు దరఖాస్తు చేసేందుకు ఈనెల 25వ తేదీతో ముగుస్తుందని చెప్పారు. ప్రవేశ పరీక్ష ద్వారానే అడ్మిషన్లు జరుగుతాయి అన్నారు. నాలుగేళ్ల కాల పరిమితి కలిగిన ఈ కోర్సులో మూడేళ్లు చదివి బయటకు రావాలంటే విద్యార్థులకు డిగ్రీ అందజేస్తామన్నారు. ఈ కోర్సు కరికులం పై ఎప్పటికే ఎన్ సి టి ఈ సిద్ధం చేసిందని దీనిపై మార్పులు చేర్పుల కోసం వర్సిటీలో వర్క్ షాప్ ను త్వరలో నిర్వహిస్తామన్నారు. ఈ కోర్సుకు పాఠశాల స్థాయి పాఠ్యాంశాలను అనుసంధానం చేస్తామన్నారు.

వీఆర్ఏల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర–కవిటి : వీఆర్ఏల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండలంలోని వీఆర్ఏలు తాసిల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా చేపట్టారు. అనంతరం తాసిల్దార్ పి శేఖర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వీఆర్ఏలు మాట్లాడుతూ వీఆర్ఏల రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఈనెల 20, 21 తేదీలలో ధర్నా చేపడుతున్నట్లు తెలిపారు. వీఆర్ఏలకు వీఆర్వోలుగా, అటెండర్గా, వాచ్మెన్‌గా పదోన్నతి కల్పించాలని, డిఏతో కూడిన జీతం అందజేయాలి, పే స్కేల్ వర్తింపజేయాలని వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్ఏలు జన్ని కృష్ణ, జె కేశవరావు, జగదీష్, జనార్ధన్ గణేష్, మోహినమ్మ, లోలాక్షి, కాశీ తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన పనులు పూర్తి చేయాలి

విశాలాంధ్ర–కవిటి: మండలంలోని డిజి పుట్టుగ గ్రామంలో ఉద్దానం ప్రాజెక్ట్ ఆధారంగా నిర్మాణ పనులు చేపడుతున్న ఓవర్ హెడ్ బ్యాలెన్స్ రిజర్వాయర్ పనులను త్వరితగతిని పూర్తి చేయాలని నియోజకవర్గ వైఎస్ఆర్సిపి సమన్వయకర్త పిరియా సాయిరాజ్ సూచించారు. ఓవర్ హెడ్ బ్యాలన్సింగ్ రిజర్వాయర్ పనులు పుర్తియ్యాక సుమారుగా 10 గ్రామాలకు మంచినీటి సదుపాయం కలుగుతుంది సాయిరాజ్ తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ, సర్పంచ్ ప్రతినిధి బెందాలం జయప్రకాశ్, కుమార్ మోహన్ రెడ్డి,మాధవ్,రఘు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల వద్దకే ప్రభుత్వ పాలన

- ఇదే జగనన్న సురక్ష కార్యక్రమం ఉద్దేశం
- ఎమ్మెల్సీ నర్తు రామారావు

విశాలాంధ్ర–కవిటి: ప్రభుత్వ యంత్రాంగం నేరుగా మీ ఇంటికి వచ్చి,మీ సమస్యలను అడిగి తెలుసుకుని,వాటి పరిష్కారానికి అవసరమైన ధృవీకరణ పత్రాల పంపిణీ చేయడమే సురక్ష కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని ఎం.ఎల్.సి. నర్తు రామారావు పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం లండారిపుట్టుగ గ్రామంలో ఎంపీపీ కడియాల పద్మ ప్రకాష్ అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రామారావు మాట్లాడుతూ విద్యార్థులు, నిరుద్యోగులు ప్రభుత్వ ధ్రువీకరణ పత్రాల కోసం రోజుల తరబడి కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి నుంచి నేరుగా మీ చెంతకే ప్రభుత్వ ధ్రువీకరణ పత్రాలను అందిస్తున్న సరికొత్త ఆలోచన ఇది అన్నారు. సంక్షేమ పథకాలు పొందేందుకు అవసరమయ్యే ధ్రువపత్రాలు లేనివారిని గుర్తించి,వారికి ఇళ్ల వద్దే అవసరమైన ధృవపత్రాలు అందించడం జరుగుతుందన్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి అనుబంధంగా జగనన్న సురక్ష కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి శ్రీకారం చుట్టారన్నారు.దీర్ఘకాలికంగా పరిష్కారం కానీ ఎన్నో సమస్యలకు,ఈ కార్యక్రమం ద్వారా పరిష్కారం లభిస్తుందన్నారు.జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఏ ఒక్క పౌరుడైన, తమ సమస్యలను విన్నవిస్తే,వాటికి పరిష్కారం చూపించిన ఘనత జగన్మోహన్ రెడ్డి సర్కార్ లో లభిస్తుందన్నారు. ప్రతి పౌరుడు తమకు జరిగిన అన్యాయాన్ని ఉన్నతాధికారులకు మెమొరండం రూపంలో సమర్పిస్తే, వాటి పరిష్కారానికి రోజుల తరబడి, నెలల తరబడి తిరిగే వారన్నారు.ఆ పరిస్థితి పోయి ఒక టోల్ ఫ్రీ నెంబర్ కు, ఫోన్ కాల్ ద్వారా సమస్యను వివరిస్తే,వాటికి పరిష్కారం చూపే వ్యవస్థకు శ్రీకారం చుట్టారన్నారు.ఇది దేశంలోనే చారిత్రాత్మకమైన నిర్ణయంగా రామారావు పేర్కొన్నారు .ఒక పార్టీ అధినేత వాలంటీర్లను, మహిళలను విక్రయించుకునే వారికి సమాచారం ఇచ్చే వ్యవస్థగా చిత్రీకరించడం పట్ల ఆయన ఆక్షేపణ వ్యక్తం చేశారు. పార్టీలకు,

కులాలకు, మతాలకు, వర్గాలకు అతీతంగా సంక్షేమ పథకాలను సకాలంలో అందిస్తున్నారన్నారు.ప్రజా సమస్యల పరిష్కార సాధన విషయంలో జె సి ఎస్ కన్వీనర్ల సహకారంతో వాలంటీర్లు చిత్తశుద్ధితో పనిచేస్తున్నారన్నారు.గత ప్రభుత్వంలో రూ.1000 లు పింఛన్ ఇచ్చినప్పుడు గంటల తరబడి పంచాయతీ కార్యాలయం వద్ద,ప్రజాప్రతినిధుల నివాసాల వద్ద నిలబడి వృద్ధులు వికలాంగులు ఇబ్బంది పడేవారన్నారు.ప్రస్తుతం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పరిపాలనలో 2,750 వేల రూపాయలు పింఛను ఒకటో తారీకునే సూర్యోదయం కంటే ముందే ఇంటికి వచ్చి వాలంటీర్లు అందిస్తున్నారని ఇది చారిత్రాత్మక వ్యవస్థ అన్నారు.సచివాలయాల పరిధిలో నివాస సముదాయంలో గృహాలను వాలంటీర్ల బృందం సందర్శించారని, వినతులు స్వీకరించారన్నారు. వచ్చిన దరఖాస్తులకు సమస్యల పరిష్కారం ధ్రువీకరణ పత్రాలు నర్తు రామారావు,స్థానిక ఎంపీపీ కడియాల పద్మ ప్రకాష్ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ పి శేఖర్, పిఎసిఎస్ అధ్యక్షులు దేవరాజ్ సాహు, మాజీ ఎంపీపీ పిఎం తిలక్, భద్రి ప్రకాష్, ఈవోపిఆర్డి శివాజీ పాణిగ్రహి, పంచాయతీ కార్యదర్శి మన్మధరావు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ పారదర్శక పాలనలో ఆదర్శంగా నిలుస్తుంది

– గడప గడపకు మన ప్రభుత్వంలో 'తమ్మినేని'

విశాలాంధ్ర–ఆమదాలవలస: పేద ప్రజల అభ్యున్న తే ధ్యేయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పలు సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ప్రజలకు అందజేస్తు న్నారని ఆంధ్రప్రదేశ్ శాసన సభాపతి తమ్మినేని సీతారాం పేర్కొన్నారు. గురువారం ఆమదాలవలస మున్సిపాలిటీ పరిధిలోని టీ జీ అర్ కాలనీ మరియు ఊసవానిపేట వార్డులలో స్పీకర్ తమ్మినేని సీతారాం ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. సంబంధిత అధికారులతో కలిసి ఆయన పాల్గొన్నారు. గ్రామంలో గల ప్రజానీకంతో ఆయన మమేకమయ్యారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలను తెలియజేస్తూ, ఒకొక్క లబ్దిదారునికి ఎంత మేరకు ఆర్థిక సహాయం అందిందో వివరించారు.స్థానికంగా మీరు ఎదుర్కొంటున్న సమస్యలేమైనా ఉంటే తనకు నేరుగా చెప్పండని పలువురిని అడిగారు.తన దృష్టికి

తీసుకు వచ్చిన సమస్యలను అక్కడికక్కడే అధికారుల దృష్టిలో పెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబా నికి సంక్షేమ పథకాలు అందాల న్నదే లక్ష్యంగా గడప గడపకు మన ప్రభుత్వ కార్య క్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతి ష్టాత్మకంగా చేపడు తుందన్నారు. ప్రతి కుటుంబా న్ని కలిసే విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఈ కార్య క్రమాని కి శ్రీకారం చుట్టారన్నారు. గ్రామానికి చెందిన పలువురు తో మాట్లాడి, వారి నుంచి సంక్షేమ పథకాలు అమలు తీరుతెన్నులు గురించి సమాచారం తెలుసుకున్నారు.

రైతు భరోసా పథకం ద్వారా సేద్యం చేసే రైతన్నలకు చేదోడుగా నిలుస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవి సుధాకర్, మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ బొడ్డేపల్లి రమేష్ కుమార్, దుంపల శ్యామల రావు, పట్టణ పార్టీ అధ్యక్షులు పొదుగు శ్రీను, సాదు చిరంజీవి, సాదు కామేశ్వరరావు, రవికాంత్, విజయ్, స్థానిక నాయకులు వైఎస్ఆర్ పార్టీ కార్యకర్తలు అధికారులు సచివాలయం సిబ్బంది వాలంటీర్లు పాల్గొన్నారు.

33 ఫైన్‌లతో వున్న ద్విచక్ర వాహనాన్ని పట్టివేత

విశాలాంధ్ర–శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం : ఒకవైపు ట్రాఫిక్ నిబంధనలు కఠిన తరం చేస్తున్నప్పటికీ, ఎటువంటి లైసెన్స్ లేకుండా ట్రిపుల్ రైడింగ్లతో ఇన్సూరెన్స్ లేకుండా యదేచ్ఛగా వాహనదారులు. వాహనాలు నడుపుతున్నారు. నగరంలోని రైతు బజార్ వద్ద డ్యూటీ నిర్వహిస్తున్న ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ పున్నయ్య తనిఖీలు నిర్వహిస్తుండగా ఒక వాహనాన్ని తనిఖీ చేస్తుండగా హెడ్ కానిస్టేబుల్ ఆ సంఘటన చూసి అవాక్కయ్యారు. ఒక బండికి 33 ఫైన్లు ఉండడం ట్రాఫిక్ సిబ్బందితోపాటు పున్నయ్య అవాక్కయ్యాడు. 2018 నుండి ట్రాఫిక్ లో ట్రాఫిక్ సిబ్బందిని కనుగప్పి. ఈ వాహనం తిరుగుతోంది. వివరాలు సేకరిస్తే ఈ వాహన విశాఖపట్నం

చెందిందని, తన అత్త పేరు మీద విశాఖపట్నం రిజిస్ట్రేషన్ అయింది వివరాలు చెప్పగా వివరాలు సరిపోవడంతో ఫైన్ లు కట్టమని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ కు వాహనం తరలించారు. ఈ సందర్భంగా పున్నయ్య మాట్లాడుతూ ఇంతవరకు ఇటువంటివి ఎక్కడ చూడలేదని ఫైన్ లు అన్ని ట్రాఫిక్ నిబంధన విరుద్ధంగా ఉన్నాయని, సెల్ఫోన్ డ్రైవింగ్ రాంగ్ పార్కింగ్ ట్రిబుల్ రైడ్ ఇన్సూరెన్స్ లేకపోవడం లైసెన్స్ లేకపోవడం ఇలా మొత్తం 33 ఫైన్లు 8000 వరకు ఉన్నాయని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనకు విరుద్ధంగా ఎవరు ప్రవర్తించిన చర్యలు తప్పవని తెలిపారు.

బరియల్ గ్రౌండ్ నిర్మాణంలో జాప్యం ఎందుకు

విశాలాంధ్ర–కోటబొమ్మాళి : మండలం రేగులపాడు పంచాయతీ పేటపాడు గ్రామంలో తలపెట్టిన బరియల్ గ్రౌండ్ నిర్మాణంలో జాప్యమెందుకని పలువురు గ్రామస్థులు అంటున్నారు. రూ. 3లక్షల పంచాయతీ రాజ్ నిధులతోను, మరికొంత గ్రామపెద్దల వాటాధనంతోను నిర్మాణం చేపట్టేందుకు భూమి పూజ చేసి నిర్మాణం చేపడుతూ అర్థంతరంగా ఎందుకు ఆపేశారని వారు అన్నారు. బరియల్ గ్రౌండ్ లేక ఎంతో కాలంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, ఎట్టకేలకు బరియల్ గ్రౌండ్ నిర్మాణానికి నిధులు సమకూరి పనులు నిర్వహిస్తున్నారన్న తరుణంలో నిలిపి వేయటంలో అంతర్యామేమిటని గ్రామ ప్రజలు చర్చించుకుంటున్నారు. ఈ నిర్మాణం చేపడుతున్న స్థలం కూడా గ్రామ కంఠం అయినందున ఎటువంటి రాజకీయ పరిణామాలుగాని, గ్రామ ప్రజల అడ్డంకలు లేవని ఇప్పటికైన అధికారులు చొరవచూపి తొలిత గతిన నిర్మాణం చేపట్టి పూర్తి చేయాలని వారాంత కోరుతున్నారు.

కాంపాక్ట్ బ్లాక్‌లో ఫస్ట్ సర్వే లైన్ నిర్వహణ

విశాలాంధ్ర–ఆమదాలవలస : మండలం ప్రకృతి వ్యవసాయ విభాగంలో భాగంగా సీపానపేట గ్రామంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది నవధాన్యాల పంటల క్షేత్రంలో పెస్ట్ సర్వే లైన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ సిబ్బంది నక్క చిరంజీవి మాట్లాడుతూ క్రమం తప్పకుండా ప్రతి వారం కూడా పంటలలో ఈ పెస్ట్ సర్వే లైన్ నిర్వహిస్తున్నామని అన్నారు. దీనినే పురుగు లు తెగుళ్ళ పై నిఘా ఉంచడం అని అంటారని, దీనికి నిర్దిష్టమైన ప్రకృతి వ్యవసాయ క్షేత్రంను అలాగే రసాయన సేద్యంలో చేస్తున్న క్షేత్రమును ఎంచుకొని ఈ రెండింటిలో పంటలలో ఉన్న పలు రకాల చీడపీడలు మరియు తెగుళ్ళ ఉధృతిని పరిశీలించి వాటిని సకాలంలో ప్రకృతి సేద్య విధానంలో నివారించే పద్ధతులను రైతులకు తెలియజేస్తున్నామని అన్నారు. ఈ విధంగా రైతులకు రసాయన వ్యవసాయ పంటలకు మరియు ప్రకృతి సాగు పంటలకు వ్యత్యాసాలను తెలియజేస్తూ 365 రోజులు కూడా పంటలు ఉండేలా రైతులకు వివరిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుపతిరావు, లక్ష్మి, కృష్ణవేణి పాల్గొన్నారు.

సుప్రీంహీరో సాయిధరమ్ తేజ్ పర్యటన విజయవంతం చేయండి

విశాలాంధ్ర–శ్రీకాకుళం టౌన్: మెగా స్టార్ చిరంజీవి మేనల్లుడు,యువ కథానాయకుడు, సుప్రీం హీరో సాయి ధరమ్ తేజ్ ఈనెల 21న శుక్రవారం ఉదయం 8 గంటలకి శ్రీకాకుళం విచ్చేస్తున్నారు. అరసవల్లి సూర్యనారాయణ స్వామి, శ్రీకూర్మంలోని శ్రీ కూర్మనాథ క్షేత్రాలను ఆయన దర్శించనున్నారు. ఈ సందర్భంగా శ్రీకాకుళం ముఖద్వారం(సింహద్వారం వద్ద ఆయనకి మెగా ఫ్యామిలీ అభిమానులు అంతా కూడా ఘన స్వాగతం పలుకడానికి నిర్ణయించారు. మెగా ఫ్యామిలీ అభిమానులు అంతా కూడా హాజరై సాయిధరమ్ తేజ్ పర్యటనను విజయవంతం చేయాలని, అఖిల భారత చిరంజీవి యువత వర్కింగ్ ప్రెసిడెంట్ తైక్వాండో శ్రీను ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు.

బూత్ఇన్‌చార్జీలు ఓటర్‌లిస్టులను పరిశీలించాలి

- మండల టీడీపీ నాయకులు

విశాలాంధ్ర–కోటబొమ్మాళి : గ్రామాల్లో శుక్రవారం నుంచి ఎన్నికల కమిషన్ చేపడుతున్న ఓటర్ల పరిశీలనలో భాగంగా నూతన ఓట్లు చేర్పించుట, నకిలిఓట్లు, మరణించిన వారి ఓట్లు తొలగింపు ప్రక్రియలో ప్రతి బూత్ ఇంచార్జు, మండల క్లస్టర్ ఇన్‌చార్జీలు స్థానిక బూత్‌లెవల్ అధికారులతో కలిసి గ్రామాల్లో పర్యటించి ఓటర్ల లిస్టును కుణ్ణంగా పరిశీలించాలని స్థానిక మండల పార్టీ అధ్యక్షుడు బోయిన రమేష్ అన్నారు. ఆయన గురువారం స్థానిక తెలుగుదేశం కార్యాలయంలో టీడీపీ సీనియర్ నాయకుడు వెలమల కామేశ్వరరావు, టెక్కలి టీడీపీ మహిళ అధ్యక్షరాలు పూజారి శైలజలతో కలిసి బూత్ ఇన్‌చార్జీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో పరిశీలనలేని ఉన్నటువంటి ఓట్లను గుర్తించి ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లు ఆ జాబితాలో ఒకే చోట ఉండేలా ఎన్నికల అధికారుతో మాట్లాడాలన్నారు. మృతిచెందిన వారి ఓట్లు, డుబ్లికేటు ఓట్లును గుర్తించి వాటిని తొలగించేందుకు ఎన్నికల అధికారులు సూచించాలని తెలిపారు. ముఖ్యంగా జనవరి 1 2024కు 18 సంవత్సరాలు నిండిన వారికి ఓటు హక్కు కల్పించే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కర్రి అప్పారావుతో పాటు పలువురు టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

యలమంచిలి సచివాలయ పరిధిలో జగనన్న సురక్ష

విశాలాంధ్ర–జలుమూరు: మండలంలో యలమంచిలి, కోమనపల్లి సచివాలయ పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వాన గోపి, ఎంపీడీఓ, మండల అధికారులు, సచివాలయ అధికారులు, సర్పంచ్ మెండ రవికుమార్ పాల్గొన్నారు. లబ్ధిదారులకు కావలసిన సర్టిఫికెట్లు అందజేశారు. ప్రజా సమస్యలపై దృష్టి సారించి, చర్యలు తీసుకోవాలని అధికారులను ఎంపీపీ కోరారు.

ఎవరికోసం ఈ సురక్షా...?

కుల ధృవీకరణ పత్రాల కోసం ప్రాణ త్యాగాలకు సైతం సిద్ధం

రత్తకన్నలో బెంతొరియాల రియాక్షన్

విశాలాంధ్ర–ఇచ్ఛాపురం : మున్సిపాలిటీ పరిధి రత్తకన్న గ్రామంలో మున్సిపల్ కమీషనర్ ఎన్. రమేష్ ఆధ్వర్యంలో అధికారులు జగనన్న సురక్షా కార్యక్రమాన్ని గురువారం చేపట్టారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ ఛైయిర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి కౌన్సిలర్లు తాడి ఆదిరెడ్డి, చిడిపోతు జగన్, భూలక్ష్మి, బచ్చు జగన్ తదితరులతో కలిసి ముఖ్య అతిథిగా హాజరై రాష్ట్రంలో ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ నేతృత్వంలో ప్రభుత్వం అన్ని వర్గాల వారికి అవసరమైన అన్ని సంక్షేమ పథకాలు అందిస్తుందని, ప్రజల స్థితి గతులు స్వయంగా తెలుసుకుని మేలు చేయడానికే జగనన్న సురక్షా కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని అన్నారు. ఆమె ప్రసంగిస్తుండగా అక్కడి ప్రజలు సమస్యలపై ఏకరువు పెట్టారు. అంతలోనే వేదిక ప్రక్కనే ఉన్న బెంతొరియా కులస్థులు తీవ్ర స్వరంతో ఎవరికి సురక్షా, ఇది ఏం సురక్షా అని నిలదీసారు. తమ కులస్థులకు కుల ధృవీకరణ పత్రాలు మంజూరు చేయిస్తామని మాట ఇచ్చి ఏమార్చారని, తమ భవిష్యత్ అంధకారంలోకి నెట్టబడిందని బెంతొరియా కులస్థులు గొంతెత్తారు. గతంలో షెడ్యూల్ కులాలకు చెందిన కులంగా ఇచ్చిన ధృవీకరణ పత్రాలు తర్వాతికాలంలో నిలుపుదల చేసారని, ప్రస్తుతం తమకు కల ధృవీకరణ పత్రాలు జారీ చేయకపోతుండటంతో తాము ఏ కులస్థులమో తెలియని సందిగ్ధ స్థితిలో ఉద్యోగాలు దక్కని దయనీయ స్థితి ఏర్పడిందని అంటూ నిరసన తెలిపారు. తమకు ఎస్టీ కుల ధృవీకరణ ప్రతాలు ఇవ్వకపోతే ప్రాణ త్యాగాలకు కూడా వెనుకాడమని సంతోషి సాహు, ఈశ్వర్ బిసాయ్, గీతా బిసాయ్, రవి, ప్రేమ్‌కుమార్, డిల్లీ బిసాయ్ తదితరులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేసారు. దాంతో పోలీసులు రంగ ప్రవేశంతో వారిని అదుపు చేసారు. విద్యా సంవత్సరం ప్రారంభమైనందున కామన్ ఎంట్రన్స్ టెస్ట్ కౌన్సిలింగ్ కోసం తమకు ఇంటిగ్రేటెడ్ సర్టిఫికేట్లు అందివ్వాలని డిమాండ్ చేసారు. ఉన్నత చదువులకు వెళ్ళ లేకపోతున్నామని, రీఅబంర్స్‌మెంట్ అందట్లేదని, విద్యా దీవెన అందట్లేదని, పలువురుకి చేయూత కూడా అందివ్వట్లేదని అక్కడి మహిళలు సంతోషి, అన్నపూర్ణ తదితరులు గొంతు కలిపారు. ఛైయిర్‌పర్సన్ మాట్లాడుతు పలుమార్లు జిల్లా కలెక్టర్ దృష్టికి విషయాన్ని నియోజకవర్గ ఇన్‌చార్జి పిరియా సాయిరాజ్, జెడ్పీ ఛైయిర్‌పర్సన్ పిరియా విజయలు తీసుకెళ్ళారని, విశ్రాంత ఐ.ఏ.ఎస్ అధికారి శ్యాముల్ ఆనంద్ నేతృత్వంలో ఏకసభ్య కమిటీని నియమించడం, ఇక్కడ పర్యటించిన నేపథ్యం బెంతొరియాలు విజ్ఞాపన పత్రాలు అందించిన విషయాన్ని ప్రస్తావించి, తప్పకుండా తమ ప్రభుత్వం న్యాయం చేసే ప్రయత్నాలు చేస్తుందని సర్దిచెప్పారు. ఈ కార్యక్రమంలో సచివాలయాల కన్వీనర్ సాలిన డిల్లీ, బూత్ కమిటీల మేనేజర్ ప్రకాశరావు పట్నాయిక్, నీలాపు డిల్లీ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీకి కోటి రూపాయల నిధులు

విశాలాంధ్ర–ఇచ్ఛాపురం : స్థానిక మున్సిపాలిటీలో వివిధ అభివృద్ధి పనులకు గాను 15వ ఆర్థిక సంఘం ద్వారా 2022–2023 వార్షికానికి రూ॥1,20,96,892/–లు మంజూరైనట్లు కమీషనర్ ఎన్.రమేష్ తెలిపారు. టైడ్ గ్రాంట్ క్రింద రూ॥ 72,58,134/–లు, అన్‌టైడ్ గ్రాంట్ క్రింద రూ॥ 48,38,758/–లను విడుదల చేయడం జరిగిందని తెలిపారు. ఆయా గ్రాంట్ల క్రింద పనులు చేపట్టుటకు అవసరమైన ప్రతిపాదనలు సేకరించడానికి శుక్రవారం సాయంత్రం 4 గంటలకు సమావేశాన్ని నిర్వహించనున్నట్లు చెప్పారు.